

త్రిపురాంతకంలో కూష్మాండ దుర్గగా...

జగజ్జననికి జేజేలు

జిల్లా అంతటా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం... త్రిపురాంతకంలోని బాలా త్రిపుర సుందరీ దేవి అమ్మవారు శేషవాహనంపై కూష్మాండ దుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొమరోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ. 25 లక్షల కరెన్సీ నోట్లతో సుందరంగా అలంకరించారు.

– న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం, కొమరోలు గ్రామీణం



కొమరోలులో కరెన్సీ నోట్లతో అలంకరణ

ఎక్సైజ్‌లో పాత తేదీలతో బదిలీలు!

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల్లో అధికారులు, సిబ్బంది బదిలీల ప్రక్రియ గత నెల 30తో ముగిసింది. ప్రస్తుతం నిషేధం మొదలైంది. ఇటువంటి తరుణంలో జిల్లా ఎక్సైజ్ శాఖలో దొడ్డిదారిన పాత తేదీలతో బదిలీలకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం జోరుగా సాగుతోంది. కోరుకున్నచోట పోస్టింగులు దక్కని కొందరు ఆ మేరకు పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. వారికి సౌకర్యవంతమైన స్థానాల్లో పోస్టింగుల కోసం సుమారు 22 మందితో ఓ జాబితా సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. చీమకుర్తి ప్రాంతంలో పని చేసే ఓ కానిస్టేబుల్‌ను జిల్లా కేంద్రానికి రప్పించటం కోసం ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు కానిస్టేబుల్ బదిలీ కోసం వైకాపాలో కీలకంగా ఉన్న జిల్లాకు చెందిన నేత ఒకరు ఎక్సైజ్ కార్యాలయంలో ఇటీవల హడావుడి చేసినట్లు సమాచారం. దీంతో దొడ్డిదారిన బదిలీలు జరిగే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి.. ఆందోళన



జీజీహెచ్ వద్ద ఆందోళన చేస్తున్న రాజశేఖర్ కుటుంబీకులు, బంధువులు

పోలీసుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిన పొన్నలూరు మండలం పరుచూరివారిపాలేనికి చెందిన పరుచూరి రాజశేఖర్ (45)... చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కొత్తపట్నం మండలంలోని ఓ హేచరీలో రెండేళ్ల క్రితం ఆయన పని చేశారు. ఆ సమయంలో అవకతవకలు జరిగాయంటూ నిర్వాహకులు ఇటీవల ఫిర్యాదు చేయడంతో... పోలీసులు సివిల్ పంచాయితీ పెట్టారు. కేసు నమోదు చేయకుండా గత నెల 27న అక్రమంగా నిర్బంధించి... తీవ్రంగా హింసించి ఖాళీ కాగితాలపై సంతకాలు చేయించారన్న విమర్శలు ఉన్నాయి. మనస్తాపానికి గురైన రాజశేఖర్... బయటకు వచ్చాక ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడిన పోలీసులు కొత్తపట్నం స్టేషన్‌లో హడావుడిగా కేసు నమోదు చేశారు. కుటుంబీకులు తొలుత జీజీహెచ్... అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. శనివారం రాత్రి తిరిగి ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. కుటుంబీకులు, బంధువులు ఆందోళనకు దిగడంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పరిహారం ఇచ్చేందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించడంతో నిరసన విరమించారు. ఆయనను వేధించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏఎస్సై చిరంజీవి, కానిస్టేబుల్ శ్రీనులను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ దామోదర్ ఉత్వర్తులు జారీ చేశారు.

ఒంగోలు వెంకటేశ్వర కాలనీలో ఉంటూ క్యాటరింగ్ చేసుకునే వ్యక్తి తమకు డబ్బులు ఇవ్వాలంటూ... పదిహేను రోజుల క్రితం చిత్తూరు జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు వచ్చి హల్‌చల్ చేశారు. తొలి రోజు వారిని వారించి పంపిన తాలూకా పోలీసులు... తర్వాత వారి నుంచి ఫిర్యాదు తీసుకుని సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించారు. ఆ క్రమంలో ఎస్సై చేయిచేసుకోవటంతో ఆయన కీటక నివారణ మందు తిని ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే ఆయనను వైద్యశాలకు తరలించడంతో ప్రమాదం తప్పింది.

స్టేషన్‌లే అడ్డాగా సివిల్ పంచాయితీలు



న్యూస్‌టుడే – ఒంగోలు నేరవిభాగం

జిల్లాలో కొందరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. స్టేషన్‌లోనే సివిల్ పంచాయితీలు చేస్తూ... తీవ్రమైన హింసకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో కొందరు ఆత్మహత్యాయత్నాలు చేస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఒంగోలు నగరంలో పక్షం రోజుల వ్యవధిలోనే ఈ తరహా సంఘటనలు రెండు చోటుచేసుకోగా... వీరిలో ఒకరు ఆదివారం మరణించడం ఆందోళనకు దారితీసింది.

గ్రానైట్ దందాకూ సహకారం

కొందరు పోలీసు అధికారులు ఆదాయమే ధ్యేయంగా అక్రమార్కులకు వంత పాడుతున్నారు. కాసులు విదిలిస్తే చాలు... ఏ అక్రమానికైనా సై అంటున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణా, జీరో బిల్లుల వ్యవహారం ఇలానే రచ్చకు దారితీసింది. గ్రానైట్ వ్యాపారాన్ని తమ కనుసన్నల్లో నడిపించాలని పోటీ పడుతున్న కొందరు వ్యక్తులు... జులాయిలకు చిల్లర ఎరచూపి అర్ధరాత్రి వేళ రోడ్లపై తిప్పుతున్నారు. దీంతో ఆయా మార్గాల్లో రాత్రివేళల్లో దాడులు చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో పోలీసులూ వారికి సహకరిస్తున్నారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ చీకటి దందాపై తాజాగా వెలుగుచూసిన ఆడియో టేప్ తీవ్ర కలకలం రేపుతోంది. గ్రానైట్ అక్రమ రవాణా సాగే మార్గంలోని కొందరు పోలీసు అధికారుల పేర్లను ఉటంకిస్తూ... వారు తమకు ఫుల్ పవర్స్ ఇచ్చారనీ, తమ వద్ద టోకెన్ తీసుకోకుంటే ఫ్లైట్ ఎక్కించి విమానం కోటింగ్ ఇప్పిస్తామని బెదిరింపులకు పాల్పడటం గమనార్హం.

ఇసుక, మట్టి మాఫియాకు అండ...

ఇసుక ఉచితమని ఓ వైపు ప్రభుత్వం ప్రకటిస్తుంటే... ప్రజలకు మాత్రం సక్రమంగా అందుబాటులోకి రావడం లేదు. ఇదే సమయంలో పలు ప్రాంతాల్లో పగలూ రాత్రీ అన్న తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడినవారే ఇందులో కీలకంగా ఉన్నట్లు సమాచారం. కొందరు పోలీసులే వీరితో చేతులు కలిపి అనధికార రవాణాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మట్టి దందా సైతం ఇదే రీతిలో సాగుతోంది. రేషన్ బియ్యం రవాణా సంగతి సరేసరి. ఇవే కాదు... జిల్లాలోని పలు స్టేషన్లలో కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎస్పీ దృష్టి సారిస్తేనే...

జిల్లా ఎస్పీగా దామోదర్ బాధ్యతలు చేపట్టాక జిల్లా కేంద్రం ఒంగోలులో అల్లరి మూకల అలజడి కొంత తగ్గింది. గతంలో సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారికి తనదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చారు. పోలీసుశాఖలోనూ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ప్రజలకు బాధ్యతాయుతంగా సేవలందించాలని అధికారులు, సిబ్బందికి హితబోధ చేస్తున్నారు. సంఘ వ్యతిరేక శక్తులకు లారీ కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ చర్యలతో శాంతిభద్రతలు నియంత్రణలోకి వస్తున్నాయని భావిస్తున్న తరుణంలో... తాజాగా చోటు చేసుకున్న పరిణామాలు పోలీసు ప్రతిష్ఠను మసకబారుస్తున్నాయి. వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- ఆదాయమే ధ్యేయంగా అక్రమార్కులకు అండ
- విమర్శలకు తావిస్తున్న కొందరి పోలీసుల తీరు



ఆలయం అభివృద్ధి పేరిట దందా!



- గిద్దలూరులో వైకాపా నాయకుల ఆగడం
- చేసిన ఖర్చులకూ లెక్క చూపని వైనం

దేవాదాయశాఖ పరిధిలోని ఏదైనా ఆలయం అభివృద్ధికి విరాళాలు సేకరించాలంటే ఆ శాఖ ఉన్నతాధికారుల అనుమతి తప్పనిసరి. ఆ మొత్తాన్ని సైతం దేవస్థానం ఖాతాలోనే జమ చేసి... తగిన ఆమోదంతోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. గత వైకాపా పాలకులు మాత్రం ఈ నిబంధనలు తుంగలో తొక్కి అడ్డగోలుగా వ్యవహరించారు. గిద్దలూరులోని గంగా పార్వతి సమేత శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానంలో చోటుచేసుకున్న ఉదంతమే ఇందుకు నిదర్శనం. – న్యూస్‌టుడే, గిద్దలూరు పట్టణం

రసీదులు ఇచ్చి వసూళ్లు...



ఓ దాతకు సంఘం పేరిట ఇచ్చిన రసీదు

పాతాళ నాగేశ్వర స్వామి ఆలయం చుట్టూ ప్రహరీ, బండ పరుపు పనులకు 2020లో రూ. కోటి నిధులు మంజూరయ్యాయి. ఇక్కడే కొందరు వైకాపా నాయకులు అక్రమాలకు తెరలేపారు. మరిన్ని అభివృద్ధి పనులు చేయాల్సి ఉందంటూ దేవస్థానం అభివృద్ధి సంఘం పేరుతో అడ్డగోలుగా నగదు వసూళ్లకు పాల్పడ్డారు. వ్యాపారులు, బంగారు వర్తకులు, గుత్తేదారులతో పాటు వివిధ శాఖల అధికారుల నుంచి మొత్తాలు సేకరించి రసీదులు అందజేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఒక్కొక్కరి నుంచి ఏకంగా రూ. 5 లక్షల మేర వసూలు చేశారు. ఈ మొత్తాలను ఆలయానికి చెందిన ఖాతాలో వేయకుండా... తమ సొంత ఖాతాల్లో వేసుకొని లెక్కాపత్రం లేకుండా ఖర్చు చేశారు. ఇంత చేసినా పనులు పూర్తికాలేదు. ప్రహరీ పైన ఇనుప కంచె వేయకుండా, ప్లాస్టింగ్ చేయకుండా వదిలేశారు. అప్పట్లో ఆలయం ఆవరణలో నిర్వహించిన శివరాత్రి ఉత్సవాల్లోనూ వైకాపా జెండాలు, పాటలు పాడించడం వివాదాస్పదమైంది.



2022లో శివరాత్రి సందర్భంగా ముద్రించిన గోడపత్రంలో విరాళాలు అందజేసిన బంగారు వర్తకుల వివరాలు

రూ.1.50 కోట్లకు పైగా సేకరణ...

2020-24 మధ్య అప్పటి వైకాపా ఎమ్మెల్యే అన్నా రాంబాబు అండదండలతోనే అనధికారింగా వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధమని ప్రశ్నించిన ఈవోను సైతం బదిలీ చేయించారన్న విమర్శలున్నాయి. దాదాపు రూ. 1.50 కోట్లకు పైగా వసూలు చేసినా వాటితో ఏం పనులు చేశారన్న దానికి లెక్కలు లేవు. ఇప్పటికైనా ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అసంపూర్తిగా నిలిచిన పనులు పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విషయాన్ని ప్రస్తుత ఈవో చిక్కుడు శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా... ఇప్పుడు సంఘం పేరిట వసూళ్లు చేయడం లేదని తెలిపారు. ప్రహరీ నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరు కాగా గుత్తేదారుకు రూ. 12 లక్షలు మాత్రమే చెల్లించామన్నారు. బండ పరుపునకు రూ. 60 లక్షలు రాగా... రూ. 20 లక్షల బిల్లులు మాత్రమే చేసినట్లు చెప్పారు.

నల్లమల... చిరుతలు భళా

- ఇతర సంరక్షణ కేంద్రాలతో పోలిస్తే ఇక్కడే అధికం

క్రూర జంతువుల్లో పెద్దపులి తర్వాతి స్థానం చిరుత పులిదే. అటువంటి చిరుతలు అధికంగా ఉన్న ప్రాంతంగా నాగార్జున సాగర్ – శ్రీశైలం పులుల సంరక్షణ కేంద్రం (ఎన్ఎస్‌టీఆర్) నిలిచింది. ఈ పరిధిలో మొత్తం 270 చిరుతలు ఉన్నాయని... మరో 90 ఈ పరిధిలో సంచరిస్తున్నాయని కేంద్ర గణాంకాలశాఖ ఎన్విస్టాట్స్-2024 ఇటీవల విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. దేశంలో ఉన్న 55 పులుల సంరక్షణ కేంద్రాల్లో ఇక్కడే అధికంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

–న్యూస్‌టుడే, పెద్దదోర్నాల



కెమెరా ట్రాప్‌నకు చిక్కిన చిరుత

ఫలిస్తున్న సంరక్షణ చర్యలు...

జీవ వైవిధ్యానికి పుట్టినిల్లు నల్లమల. పెద్ద పులుల ఆవాసానికి అనుకూలంగా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఎన్ఎస్‌టీఆర్ ఏర్పాటు చేసింది. నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉండగా... అందులో 1,401 చదరపు కిలోమీటర్ల పరిధిలో పులుల అభయారణ్యం ఉంది. ఇందులో ఎనభైకి పైగా పెద్ద పులులు ఉన్నాయి. వీటి సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. స్మగ్లర్ల బారినపడకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వేసవిలో వాటి దాహార్తి తీర్చేందుకు సాసర్ పిట్ల ఏర్పాటు, అగ్ని ప్రమాదాల బారిన పడకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఈ అంశాలు చిరుతపులుల సంఖ్య పెరిగేందుకూ దోహదం పడింది.

సింహాలు, పెద్ద పులులు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే జీవనం సాగిస్తాయి. చిరుతలు అలా కాదు. అన్ని చోట్లా మనుగడ సాగించగలవు. ఈ కారణంగానే మైదాన ప్రాంతాల్లోనూ అవి సంచరిస్తుంటాయి.

గణన ప్రత్యేకం...

పెద్ద పులులు, చిరుతల గణనను పలు రకాలుగా చేపడతారు. వాటి పాద ముద్రలను సేకరించడం ఓ పద్ధతి. దీర్ఘచతురస్రంగా ఉంటే ఆడ, చతురస్రంగా ఉంటే మగ పులిగా గుర్తిస్తారు. పెద్ద పులి పాదం 14 నుంచి 15 సెం.మీ.లు ఉంటే... చిరుతది 7 నుంచి 8 సెం.మీ.గా ఉంటుంది. అవి సంచరించే ప్రాంతాల్లో కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు ద్వారానూ గుర్తిస్తారు. ఏ రెండు పులులకు ఒకేలా చారలు, మచ్చలు ఉండవు. వాటిని బట్టి కూడా సంఖ్యను లెక్కిస్తారు.

కేంద్ర గణాంక శాఖ ఎన్విస్టాట్స్-2024 నివేదిక ప్రకారం...

దేశంలో ఉన్న మొత్తం చిరుతలు:	13,874
ఎన్ఎస్‌టీఆర్‌లో ఉన్నవి, సంచరిస్తున్నవి:	360
రాష్ట్రంలో మొత్తంగా ఉన్నవి:	569

పేరు అక్కడ... ఉండేది ఇక్కడ!



చిత్రంలో కనిపిస్తోంది... హనుమంతునిపాడు పోలీసు స్టేషన్. బోర్డు ఉంది కదా... ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేంటనేగా మీ అనుమానం. కనిగిరి పట్టణంలో ఇది ఉండడమే విచిత్రం. దాదాపు పాతికేళ్ల క్రితం ఈ ప్రాంతంలో నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉండేది.. హనుమంతునిపాడు మండలం చుట్టూ నల్లమల అడవులు, భైరవకోన, వెలిగొండ కొండలు ఉండడంతో... వారి ప్రాబల్యం మరింతగా ఉండేది. అప్పట్లో అక్కడ ఓ అద్దె ఇంట్లో నిర్వహించే స్టేషన్‌కు తరచూ బెదిరింపులు వచ్చేవి. తగిన భద్రతా లేకపోవడంతో అప్పటి జిల్లా అధికారులు కనిగిరి పట్టణానికి మార్చారు. తరువాత మావోయిస్టుల ప్రాబల్యం తగ్గినా... స్టేషన్ మాత్రం ఇక్కడే కొనసాగిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... ఏదైనా ఫిర్యాదు చేసేందుకు రావాలంటే మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఒక్కోసారి కేసు విషయమై రాత్రి పొద్దుపోయే వరకు ఇక్కడే ఉండాల్సి వస్తోంది. దీంతో భోజనం ఇతరత్రా ఖర్చులు తడిచి మోపెడవుతున్నాయి. ముఖ్యంగా శివారు గ్రామాల వారు... రాత్రి తొమ్మిది గంటలు దాటితే తిరిగి వెళ్లేందుకు అవకాశం లేక బస్టాండ్‌లోనే, రోడ్డు పక్కనే తలదాచుకోవాల్సి వస్తోంది. హనుమంతునిపాడులో స్టేషన్ నిర్మాణానికి కొందరు దాతలు స్థలం ఇచ్చారు. చందాలతో భవనం పనులు చేపట్టినా మధ్యలోనే ఆగిపోయి సమస్య నెలకొంది. ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అక్కడివారు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కనిగిరి

ఉపాధి పనుల్లో అక్రమాలకు చెక్!

- పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ప్రత్యేక యాప్

న్యూస్‌టుడే – పామూరు



యాప్ ముఖ చిత్రం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకతను పెంచేందుకు... అందరికీ సమాచారం అందుబాటులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం జన్‌మన్‌రేగా (జేఏఎన్ఎమ్ఏఎన్ఆర్ఈజీఏ) పేరిట ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చింది. చేతిలో చరవాణి ఉంటే చాలు సమస్త వివరాలూ తెలుసుకోవచ్చు. అక్రమాలపై నేరుగా ఫిర్యాదులూ చేయవచ్చు.

అరచేతిలోనే అన్ని వివరాలు...: గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇందులో కూలీల వివరాలు, హాజరు, వేతనాలు తదితర వివరాల సూచికపై క్లిక్ చేస్తే తెరుచుకుంటుంది. రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ పంచాయతీ, ఉపాధి జాబ్ కార్డు సంఖ్య నమోదు చేస్తే వివరాలు ప్రత్యక్షమవుతాయి. కూలీ పేరుపై క్లిక్ చేయగానే... ఎన్ని రోజులు పని చేశారు, ఎంత కూలి వచ్చింది, ఏ బ్యాంకు ఖాతాలో జమ అయ్యిందన్న వివరాలు కనిపిస్తాయి. ఒకవేళ నగదు జమ కాకపోతే... ఎందుకు కాలేదన్న కారణాలూ స్పష్టంగా కనిపిస్తాయి. పథకంలో చేపట్టే పనుల వివరాల సమాచారమూ అందుబాటులో ఉంటుంది.

అక్రమాలపై ఫిర్యాదు చేయొచ్చు...: ఉపాధి పనుల్లో అవకతవకలు, అక్రమాలు చోటుచేసుకున్నాయని తెలిస్తే... యాప్ ద్వారా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో పని చేసినా, బిల్లులు చేయకుండా సిబ్బంది ఇబ్బంది పెట్టినా తెలియజేయవచ్చు. ఈ వివరాలు అన్ని భాషల్లోనూ అందుబాటులో ఉన్నాయి. పలు ప్రాంతాల్లోని చేపడుతున్న పనుల్లో అవినీతి బాగోతాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో యాప్‌లో ఈ సౌకర్యం కల్పించారు.

అవగాహన కల్పిస్తేనే ప్రయోజనం.. :. ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత పెంచేందుకు కేంద్రం పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నా వాటిపై ప్రజలకు అవగాహన ఉండడం లేదు. ఈ నేపథ్యంలో జన్‌మన్‌రేగా యాప్‌పై గ్రామస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. దీనిని ఎలా వినియోగించాలన్నది పని ప్రాంతాల్లో కూలీలకు అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఉంటుంది. ప్రభుత్వ లక్ష్యమూ నెరవేరుతుంది.

జిల్లాలో ఉపాధి హామీ పథకం వివరాలు (లక్షల్లో)...

మొత్తం జాబ్ కార్డులు:	4.38
మనుగడలో ఉన్నవి:	3.80
మొత్తం కూలీలు:	8.06
పనికి వెళ్తున్న వారు:	6.76

వంద రోజులు పని పూర్తయిన వారు 3,327 మాత్రమే ఉన్నారు.

ఉద్యాన పంటలకు ఊతం

- రూ.20.88 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక
- ఇప్పటికే గత ప్రభుత్వ బకాయిల చెల్లింపు



కుంచేపల్లిలో దానిమ్మ తోట పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి గోపీచంద్

న్యూస్‌టుడే – ఒంగోలు నగరం

వైకాపా సర్కారు పాలనలో పడకేసిన పండ్ల తోటల సాగు... కూటమి ప్రభుత్వం చేయూతతో తిరిగి పుంజుకుంటోంది. గత పాలకులు పెట్టిన రాయితీ బకాయిలను ఇప్పటికే చెల్లించడంతో పాటు... కొత్తగా తోటల పెంపకం, పంట నిల్వ సౌకర్యాలు, సేద్యం పరికరాలు, ఫారం పాండ్స్, ప్యాక్ హౌస్‌లు, మినీ ట్రాక్టర్లు, కలెక్షన్ సెంటర్లు వంటి పథకాలన్నీ పునరుద్ధరించాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా 2024-25 కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ నేపథ్యంలో ఉద్యాన రైతులకు రాయితీలు ఇచ్చేందుకు కలెక్టర్ ఇటీవలే పాలనాపరమైన అనుమతులు ఇచ్చారు.

కూటమి ప్రభుత్వం కొలువుదీరే నాటికి జిల్లాలో 400 మంది రైతులకు రూ. 4.33 కోట్ల బకాయిలు ఉండగా... నెల రోజుల క్రితమే ఆ మొత్తం విడుదల చేసింది. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ హార్టీకల్చర్ (ఎంఐడీహెచ్) పథకం కింద రూ. 2.87 కోట్లు, ఆర్కేవీవై కింద రూ. 1.45 కోట్లు విడుదల చేసింది.

గతంలో అయినవారికే చెల్లింపులు...

గత ప్రభుత్వ హయాంలో రాయితీ నిధులు విడుదల కాక... కొత్తగా పండ్ల తోటల సాగుకు రైతులు ఆసక్తి చూపలేదు. ఆ కారణంగానే 2023-24లో ఆరు వేల హెక్టార్లు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ సగం కూడా సాకారం కాలేదు. రైతులు ముందుగా వందశాతం ఖర్చు పెట్టుకొని పండ్ల తోటలు సాగుచేస్తారు. అందుకు అవసరమైన శాశ్వత పందిళ్లు, ఫారం పాండ్స్, ప్యాక్ హౌస్‌లు వంటివి నిర్మిస్తారు. రాయితీ కోసం దరఖాస్తు చేశాక ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించి... మార్గదర్శకాల ప్రకారం ఎంత రాయితీ వర్తిస్తుందో అంత చెల్లిస్తారు. వైకాపా పాలకులు మాత్రం ఏ సంవత్సరమూ పూర్తిస్థాయిలో రాయితీలు చెల్లించలేదు. అడపాదడపా వచ్చిన నిధులను కూడా... ప్రజాప్రతినిధుల సిఫార్సులతో తమ అనుయాయులకే ఇచ్చుకున్నారు.

కొత్తగా 800 హెక్టార్లు లక్ష్యం...

ఈ ఏడాది జిల్లాలో కొత్తగా 800 హెక్టార్లలో పండ్ల తోటలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 400 హెక్టార్లలో రైతులను గుర్తించి నమోదు ప్రక్రియ పూర్తిచేశారు. మొత్తం 38 మండలాలకు కలిపి ఎంఐడీహెచ్ కార్యాచరణ ప్రణాళిక రూ. 20.88 కోట్లుగా నిర్ణయించారు. ఆయా యూనిట్లను బట్టి 40 నుంచి 60 శాతం రాయితీలు చెల్లిస్తారు. రాష్ట్రీయ కృషి విజ్ఞాన యోజన (ఆర్కేవీవై) కింద మరో రూ. 1.11 కోట్లు మంజూరు చేశారు. ఎంఐడీహెచ్ ద్వారా రెండు వేల మందికి, ఆర్కేవీవై ద్వారా 90 మందికి రాయితీలు లభించనున్నాయి.

జలమంతా విషతుల్యం



- కనిగిరిలో ప్రమాదకర స్థాయిలో ఫ్లోరైడ్!
- 'న్యూస్‌టుడే' పరిశీలనలో తేటతెల్లం


వానొచ్చినా..వరదొచ్చినా..వాగులు..వంకలు ముంచెత్తినా..ఆ ప్రాంతం గరళం నుంచి విముక్తి పొందలేకపోతోంది. భూమిలోకి పెద్దఎత్తున వర్షం నీరు ఇంకినా ఫ్లోరైడ్ భూతం కబంధ హస్తాల నుంచి బయటపడలేకపోతోంది. వేసవి నిల్వ ట్యాంకులు, ఇంటింటికీ కుళాయిలు వంటివి కూడా కనిగిరి దిది వంచితులను పూర్తిగా కాపాడలేకపోతున్నాయి. పురపాలక సంఘం పరిధిలో ఫ్లోరైడ్ శాతం పరిశీలించేందుకు 'న్యూస్‌టుడే' తాజాగా చేసిన పరిశీలనలో మరిన్ని చేదు నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే కొన్ని కాలనీల్లో 12 పీపీఎం వరకూ ఫ్లోరైడ్ ఉండటం వెన్నులో వణుకు పుట్టిస్తోంది.



కనిగిరి నీటి పరీక్షా కేంద్రంలో నాణ్యత పరీక్షలు చేస్తున్న సహాయకుడు

కనిగిరి, న్యూస్‌టుడే:

పశ్చిమంలో కీలకమైన కనిగిరి ఇప్పటికీ శుష్కప్రాంతంగానే మిగిలింది. నియోజకవర్గంలో 135 పంచాయతీల పరిధిలో 446 గ్రామాలున్నాయి. దాదాపు 3.80 లక్షల మంది జనాభా ఉంది. ప్రభుత్వాలు ఎన్ని ఉపశమన చర్యలు చేపట్టినా.. ఇక్కడి ఫ్లోరైడ్ మహమ్మారికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. పురపాలక సంఘంతో పాటు చాలా గ్రామాల్లో 2 పీపీఎం నుంచి 12 పీపీఎం వరకు ఉంటోంది. కనిగిరి మున్సిపాలిటీలో 20 వార్డులున్నాయి. వాటి పరిధిలో నీటి స్వచ్ఛత, ఫ్లోరైడ్ శాతాన్ని అంచనా వేసేందుకు 'న్యూస్‌టుడే' ఇటీవల పలు కాలనీల్లో నమూనాలు సేకరించింది. అందులో 13 వార్డుల్లోని కొన్నిటిల్లో 12 శాతం వరకు పీపీఎం ఉన్నట్లు నీటి నాణ్యత పరీక్షల్లో తేలడం ఒళ్లు జలదరించే విషయం. బోర్లు, డీప్ బోర్ల ద్వారా వినియోగించుకునే నీటిలో అధికంగా ఈ మహమ్మారి ఉన్నట్లు స్వయానా నీటి నాణ్యత పరీక్షలు చేసిన ఎనలిస్ట్ చెప్పారు.



ఎక్కడ? ఎంతెంత??

కనిగిరి పట్టణంలోని చాలా కాలనీల్లో నీళ్లు విషతుల్యంగా మారాయి. కొన్ని కాలనీల్లో పది శాతానికి మించి ఫ్లోరైడ్ ఉంది. అయినప్పటికీ అక్కడి నీటికి స్థానికులు వివిధ అవసరాలకు వినియోగిస్తున్నారు. శివనగర్ కాలనీలో నీటి నమూనాలు తీసుకుని విశ్లేషించగా, 12 శాతం పీపీఎం ఉన్నట్లు తేలింది. గతంలో ఇక్కడి బోర్లను వినియోగించకూడదని అధికారులు చర్యలు చేపట్టారు. వాటిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టినా గత్యంతరం లేక కొందరు వాడుతున్నారు. కొత్తపేటలో 5 పీపీఎం వరకు ఉంది.

గ్రామీణంలోనూ...

గ్రామీణ ప్రాంతాలైన బొమ్మిరెడ్డిపల్లె, కమ్మవారిపల్లెలోనూ 12 పీపీఎం వరకూ ఉంది. దీని వల్ల ఎముకలు, కీళ్ల, మూత్రపిండ సంబంధిత వ్యాధుల బారిన పడే ప్రమాదముంది. నియోజకవర్గంలో 145 గ్రామాల్లోని బోర్లలోని నీటిని వాడవద్దని, అత్యంత ప్రమాదకర స్ట్రాన్షియం, ఫ్లోరైడ్ ఉందని నిపుణులు ఇప్పటికే హెచ్చరించారు.



అత్యధిక ఫ్లోరైడ్ ఉన్న శివనగర్ కాలనీ డీప్‌బోర్ వద్ద నమూనా సేకరణ



బొగ్గులగొందికి చెందిన ఫ్లోరైడ్ బాధితుడు శోభన్‌బాబు

దశల వారీగా చేయొచ్చు

నీటి నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షలు చేసి పంపుతున్నాం. తాగునీటితో పాటు వ్యవసాయానికి వాడే జలాల్నీ కూడా పూర్తిస్థాయిలో మార్చాలి. అప్పుడే ఫ్లోరైడ్ రక్కసి నుంచి బయటపడగలం. దశలవారీగా ఇంటింటికి కుళాయి, ఇతర పథకల ద్వారా శుద్ధజలాన్ని అందించాలి. తద్వారా శాశ్వతంగా దీనికి ముగింపు పలకొచ్చు.

– విశ్వనాథరెడ్డి, డీఈ, ఆర్ డబ్ల్యూఎస్

వరద బాధితులకు రెడ్‌క్రాస్ వితరణ



రాజీవ్‌నగర్‌లో నిత్యావసరాలు అందజేస్తున్న జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్, సభ్యులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: విజయవాడలోని వరద బాధితులకు రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా నిత్యావసరాలు అందజేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రకాశం నుంచి సంస్థ అధ్యక్షుడు పి.ప్రశాంత్‌బాబు, వైస్ ఛైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ఛైర్మన్ శ్రీధర్‌రెడ్డి సూచనమేరకు రాజీవ్‌నగర్‌లోని బాధిత కుటుంబాల వారికి రూ.3 కోట్ల విలువైన సామగ్రిని పంపిణీ చేసినట్లు ప్రశాంత్‌బాబు తెలిపారు. అన్ని జిల్లాల రెడ్‌క్రాస్ సంస్థలు కలిసి 2500 మందికి సాయం అందించినట్లు పేర్కొన్నారు.

రూ.1.70 లక్షల సాయం అందజేత



చెక్కు అందజేస్తున్న సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు తదితరులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.1.70 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మేరకు సదరు చెక్కును ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు అందజేశారు.



మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

విశ్రాంత సైనికుల సమస్యలు పరిష్కరిస్తాం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని మాజీ సైనికుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో వైమానిక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం ఈ రోజు ప్రశాంతంగా ఉందంటే అందుకు కారణం సైనికులే అన్నారు. దేశం కోసం సేవ చేయాలన్న ఉద్దేశంతో ప్రకాశం జిల్లా నుంచి ఎక్కువ మంది సైనికులుగా వెళ్లారని వివరించారు. మాజీ సైనికుల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. వారికి ఇంటి స్థలాలు, సైనిక భవనానికి స్థలం కేటాయింపు, స్మారక స్తూపం ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ సైనిక అభివృద్ధి బోర్డు డైరెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారిణి రజనీకుమారి, మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు, సంఘం నాయకులు గుమ్మడి వెంకటరావు, పాశం వెంకటరెడ్డి, కె.బ్రహ్మయ్య, ఆలపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధ్యయన బృందంలో ఒంగోలు కమిషనర్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: పురపాలక, నగరపాలక సంస్థల్లో ఉత్తమ సేవలపై అధ్యయనానికి రాష్ట్ర స్థాయిలో నియమించిన కమిటీలో ఒంగోలు కమిషనర్ కె.వెంకటేశ్వరరావుకు చోటు దక్కింది. రాష్ట్రంలో నాలుగు అధ్యయన కమిటీలను నియమించారు. ఒక్కో కమిటీలో ఇద్దరు కమిషనర్లు, ఇద్దరు మున్సిపల్ ఇంజినీర్లు సభ్యులుగా ఉంటారు. వారు వివిధ రాష్ట్రాల్లో మున్సిపల్ సర్వీసులను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తారు. దానిలో భాగంగా కమిషనర్ వెంకటేశ్వరరావు సభ్యుడిగా ఉన్న కమిటీలో మంగళగిరి కమిషనర్ సభ్యునిగా ఉంటారు. ఆదివారం కమిటీ సభ్యులు బయలుదేరి వెళ్లారు. ఒంగోలు కమిషనర్ కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోని పురపాలక సంఘాలను సందర్శిస్తారు. అక్కడ మున్సిపల్ సర్వీసులు, పన్నుల వసూలు ప్రజా సమస్యల పరిష్కారం, తాగునీటి సరఫరా, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలిస్తారు. సోమవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు ఈ పర్యటన జరుగుతుందని కమిషనర్ తెలిపారు. మొత్తం 8 రాష్ట్రాల్లో నాలుగు బృందాలు పర్యటిస్తాయన్నారు. ఈ నెల 11న తిరిగి విధుల్లో చేరనున్నట్లు తెలిపారు.

గొట్లగట్టులో నకిలీ పత్రాల దందా

కొనకనమిట్ల, న్యూస్‌టుడే : కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టులోని ఓ ఇంటర్‌నెట్ సెంటర్ నిర్వాహకుడు నకిలీ పత్రాలు తయారు చేస్తున్నారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి. కొనకనమిట్ల, హెచ్‌ఎంపాడు, తర్లుపాడు మండలాలకు చెందిన రైతులకు నకిలీ పత్రాలు తయారు చేసి ఇచ్చినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో సచివాలయంలో పని చేసిన ఇతను తహసీల్దారు సంతకాలను కంప్యూటర్‌లో కాపీ చేసుకొని ఆన్‌లైన్ 1బీ, అడంగల్ రాని రైతుల నుంచి నగదు తీసుకొని నకిలీ దస్త్రాలు తయారు చేసి ఇస్తున్నాడని, వీటితో రైతులు బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్నారని పలువురు చెబుతున్నారు. గత సంవత్సరం పదుల సంఖ్యలో ఇలా నకిలీ పత్రాలు తయారు చేసి నగదు వసూలు చేసినట్లు పేర్కొంటున్నారు. అర్హులైన రైతులకు రుణాలు మంజూరు చేయమంటే కాళ్లు అరిగేలా తిప్పుకునే బ్యాంకు అధికారులు ఇలాంటి వారికి మాత్రం రుణాలు వెంటనే మంజూరు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. తన పేరుతో కొద్ది రోజుల కిందట సదరు సెంటర్ నిర్వాహకుడు నకిలీ పత్రాలు మంజూరు చేసినట్లు తహసీల్దారు ఆవుల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

జంతువులను వేటాడే ముఠా పట్టివేత

మార్కాపురం, న్యూస్‌టుడే: నల్లమలలో జంతువులను వేటాడే ముఠాను అటవీశాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వీరు గుప్త నిధుల కోసం తవ్వకాలు కూడా జరుపుతున్నారని వారు వెల్లడించారు. ఈ మేరకు 12 మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. దోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం, మార్కాపురం ప్రాంతాలకు చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడి నల్లమల అటవీ ప్రాంతంలో అలుగులను వేటాడుతున్నారు. దోర్నాల అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో అలుగులను వేటాడేందుకు వెళుతున్నారన్న సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ బృందం దాడిచేసి వారిని అదుపులోకి తీసుకుంది. పరారీలో ఉన్న వారిని పట్టుకోవడానికి బృందాలు గాలిస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ చెప్పారు.

గ్రామస్థుల నిజాయతీ

పోగొట్టుకున్న నగదు తిరిగి అందజేత



నగదు అందిస్తున్న ఎస్సై నాగమల్లేశ్వరరావు, కానిస్టేబుల్ వెంకట్రావు

టంగుటూరు, న్యూస్‌టుడే: పట్టపగలే నలుగురు చూస్తుండగానే అందినకాడికి దోచుకుంటున్న రోజులివి. అయితే ఆ గ్రామస్థులు దీనికి భిన్నం. చీకటి పడుతున్న వేళ తమకు దొరికిన నగదు సంచిని భద్రపరిచి బాధితుడికి అందజేసి నిజాయతీ చాటుకున్నారు జమ్ములపాలెం గ్రామస్థులు. ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. సంతనూతలపాడు మండలం గొర్రెమిట్టకు చెందిన మద్దినేని వెంకటేశ్వర్లు (70) శనివారం టంగుటూరు మండలం జమ్ములపాలెంలోని తన కుమార్తె వద్దకు వెళ్లారు. అదేరోజు సాయంత్రం వేళ స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. తన వద్ద ఉన్న రూ.85 వేల నగదు, వెండి గొలుసు ఉన్న సంచిని పట్టుకుని ఆటో కోసం వేచి ఉన్నారు. ఆటో ఎక్కి ప్రయాణించే క్రమంలో సంచి పడిపోయింది. ఇంటికి చేరుకున్నాక చూడగా.. సంచి కన్పించలేదు. దీంతో లబోదిబోమంటూ కుమార్తెకు విషయాన్ని తెలిపాడు. బంధువులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు అప్రమత్తమై వృద్ధుడు ప్రయాణించిన మార్గంలో విచారించారు. అయితే అప్పటికే జమ్ములపాలెం గ్రామస్థులు రోడ్డుపై పడివున్న నగదు సంచిని గుర్తించి భద్రపరిచారు. ఈ మేరకు బాధితుడు, పోలీసు సిబ్బంది చెప్పిన వివరాలు సరిపోవడంతో వారు నగదు సంచిని పోలీసులకు అప్పగించారు. దీంతో ఆదివారం బాధితుడిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నిజాయతీని, కానిస్టేబుల్ వెంకట్రావు చొరవను ఎస్సై నాగమల్లేశ్వరరావు అభినందించారు.

సచివాలయ బదిలీలపై కలెక్టర్ ఆరా

ఈనాడు కథనానికి స్పందన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియకు సంబంధించి 'ఈనాడు' దినపత్రికలో ఆదివారం 'నగదు ఇవ్వు..లేఖ తీసుకెళ్లు' శీర్షికన ప్రచురితమైన కథనంపై కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆరా తీశారు. గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శుల బదిలీల్లో నెలకొన్న జాప్యం, వారి నుంచి నగదు వసూళ్లు, అందులో ఎవరి పాత్ర ఎంత తదితర అంశాలపై ఆరా తీశారు. సదరు ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన పోస్టింగ్ ఉత్తర్వులను ఆదివారం హడావుడిగా పీటీసీలో జరిగిన శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఎంపీడీవోలు, ఈవోఆర్డీలకు అందజేయడం గమనార్హం.

రూ.అరకోటి వృథా.. శీతలీకరణ లేక వృథ

బొమ్మలుకు



నిరుపయోగంగా గోదాం

అన్నదాతల కోసం రెండు దశాబ్దాల క్రితం పెద్దదోర్నాలలో రూ.50 లక్షలతో మార్కెట్ యార్డు కార్యాలయం, గోదాం, షెడ్డు నిర్మించారు. రెండేళ్లపాటు కొనుగోలుదారులు, రైతులతో కళకళలాడింది. దాన్ని విస్తరించేందుకు పెద్ద గోదాం నిర్మించారు. అయితే కొనుగోలు చేసిన మిర్చి, ఇతర ఉత్పత్తులు నిల్వ చేసేందుకు శీతలీకరణ సౌకర్యం లేకపోవడంతో రైతులు, వ్యాపారులు అక్కడ నిల్వచేయడంపై ఆసక్తి చూపలేదు. గోదాములను శీతలీకరణ సౌకర్యం కల్పిస్తే వేలాదిమంది రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– పెద్దదోర్నాల, న్యూస్‌టుడే



శిథిలావస్థలో వ్యవసాయమార్కెట్ కార్యాలయం

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 123, రిటైల్ లైవ్ - 145, చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్- 239

ఆత్మహత్యకు యత్నిస్తున్న.. యువకుడిని రక్షించిన పోలీసులు



షబ్బీర్ (తెల్ల చొక్కా)ను అప్పగిస్తున్న సీఐ

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నిస్తున్న యువకుడిని పోలీసులు కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ హజరత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమబెంగాల్ రాష్ట్రం సిలిగిరికి చెందిన షేక్ అన్సారీ ఇరవై ఏళ్ల క్రితం నెల్లూరు జిల్లా కందుకూరులోని జనార్దన్ కాలనీకి వచ్చి స్థిరపడ్డారు. అతని రెండో కుమారుడు షబ్బీర్ హైదరాబాద్‌కు చెందిన యువతిని ప్రేమించి నాలుగేళ్లుగా కందుకూరులో సహజీవనం చేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె నాలుగు నెలల క్రితం షబ్బీర్‌తో గొడవపడి హైదరాబాద్‌కు వెళ్లిపోయింది. అప్పటినుంచి ఒంటరిగా ఉంటున్న షబ్బీర్ ఆదివారం ద్విచక్ర వాహనంపై సోమరాజుపల్లి వచ్చి అక్కడి రైలుపట్టాలపై ఆత్మహత్యకు యత్నిస్తుండగా..సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి కాపాడారు. అనంతరం కార్యాలయానికి తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి సోదరుడికి అప్పగించారు. ఏఎస్సై శేషారెడ్డి, హోంగార్డు సురేష్ పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన ఒకరి మృతి

కావలి, న్యూస్‌టుడే: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వైనమిది. జిల్లాలోని మండల కేంద్రమైన చీమకుర్తి పట్టణంలోని తూర్పుపాలేనికి చెందిన శివచేతన్ (21) శనివారం వ్యక్తిగత పనిపై నెల్లూరుకు వచ్చి తిరిగి వెళుతున్నాడు. పట్టణ శివారు మద్దూరుపాడులో జాతీయ రహదారిపై అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. గాయాలైన అతన్ని హైవే అంబులెన్స్‌లో కావలి ప్రాంతీయాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు.

మూలగుంటపాడులో భారీ చోరీ



ఇంటిని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరాయకొండ మండలం మూలగుంటపాడులో ఓ భారీ చోరీ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో నివాసముంటున్న పొత్తూరి శ్రీరామమూర్తి స్థానికంగా ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఈ నెల ఒకటో తేదీన దగ్గరి బంధువు అనారోగ్యం పాలవ్వడంతో పలకరించేందుకు నెల్లూరు వైద్యశాలకు వెళ్లి ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామం చేరుకున్నారు. ఇంటిలోకి వెళ్లగా.. బీరువా తెరిచి ఉండి, అందులోని రూ.3 లక్షల నగదు, 47 సవర్ల బంగారు ఆభరణాలు, 11 కేజీల వెండి సామగ్రి కన్పించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఐ హజరత్తయ్య ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, వేలిముద్రల సేకరణ నిపుణులకు సమాచారమందించారు. అనంతరం వారు పోలీసు జాగిలంతో సంఘటనా స్థలం, చుట్టు పక్కల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర తెలిపారు. ఒంగోలు సీసీయస్ సీఐ రంగనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

తాళాలు పగులగొట్టి..



ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం బృందం

కంభం, న్యూస్‌టుడే : తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి నగలు, నగదు చోరీ చేసిన సంఘటన పట్టణ పరిధిలోని గణేష్‌నగర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గణేష్‌నగర్‌లో నివాసముండే ముత్యపుపోగు డయానా ఈ నెల 1న ఇంటికి తాళాలు వేసి తన అత్తగారి ఊరైన గిద్దలూరు మండలం దేవనం వెళ్లారు. తిరిగి శనివారం రాత్రి వచ్చి చూడగా ఇంట్లోని గేటు తాళాలు పగులగొట్టి .. తలుపుల గడియ కోసి లోపలికి వెళ్లారు. అనంతరం బీరువా తెరిచి అందులో ఉన్న అయిదు తులాల బంగారం, రూ. 5 వేల నగదు ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం బృందం చోరీ జరిగిన ఇంటిలో ఆధారాలు సేకరించింది. సంఘటన స్థలాన్ని సీఐ మల్లికార్జునరావు, ఎస్సై నరసింహారావు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ సర్పంచిపై ఇనుపరాడ్లతో దాడి



గాయపడిన పెమ్మని ఓంకార్

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ మాజీ సర్పంచిపై గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి దాడి చేయడం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మాదాలవారిపాలెం మాజీ సర్పంచి పెమ్మని ఓంకార్ శనివారం రాత్రి తన సొంత పనుల మీద పొదిలికి వచ్చి రాత్రి పదకొండు గంటలకు ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరారు. విశ్వనాథపురం బ్యాంకు కాలనీ వద్ద ముగ్గురు దుండగులు ఆయన ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా నిలిపి ఇనుప రాడ్లతో దాడిచేశారు. ఈ సంఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లాలని సూచించారు. సమాచారం అందుకున్న ఎస్సై వేమన సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆరా తీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కత్తితో అన్నపై...



కంభం వైద్యశాలలో చికిత్స పొందుతున్న పెద్ద బాదుల్లా

బేస్తవారపేట, న్యూస్‌టుడే: స్థల వివాదం నేపథ్యంలో కత్తితో అన్నపై తమ్ముడు దాడి చేసి గాయపరిచిన సంఘటన బేస్తవారపేటలో శనివారం చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బేస్తవారపేట పట్టణంలోని పోలేరమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న దూదేకుల పెద్ద బాదుల్లాకు అతని సోదరుడు చిన్న బాదుల్లాకు మధ్య స్థల వివాదముంది. దీంతో ఇరు కుటుంబాల మధ్యా కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తన ఇంటి పశువుల కొష్టంలో ఉన్న పెద్ద బాదుల్లాపై తమ్ముడు చిన్న బాదుల్లా మొద్దు కత్తితో దాడి చేయగా తలకు తీవ్రగాయమైంది. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, వైద్యులు తలకు 5 కుట్లు వేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీంద్రారెడ్డి తెలిపారు.



1983–85 ఎస్వీ డిగ్రీ కళాశాలలో చదివిన తోటి విద్యార్థులతో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

గిద్దలూరు ఎస్వీ డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గిద్దలూరు విరా సుబ్బరత్నం కల్యాణ మండపంలో 1983–85 ఎస్వీ డిగ్రీ కళాశాలలో చదివిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. తన తోటి పూర్వ విద్యార్థులతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. - గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే

అబ్దుల్ కలాం అవార్డుకు ఎంపిక

పెద్దదోర్నాల: సాత్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ప్రతి ఏడాది అందించే డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డుకు పెద్దదోర్నాల హర్ష ఇండియన్ ఉన్నత పాఠశాల డైరెక్టర్ ఎమ్.మల్లికార్జునరావు ఎంపికయ్యారు. 20 ఏళ్లుగా గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి అవార్డు అందించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య తెలిపారు. ఈ నెల 20న నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

అన్న క్యాంటీన్‌కు విరాళం

గిద్దలూరు పట్టణం : ప్రభుత్వం పేదలకు రూ.5కే భోజనం అందజేస్తున్న అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం కొమరోలు ఎస్వీ బీఎస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.పి.గురవయ్య ఆదివారం ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి రూ.25వేల చెక్కును అందజేశారు. అన్న క్యాంటీన్‌కు విరాళం అందజేసిన ఆయనను ఎమ్మెల్యే అభినందించారు.



యర్రగొండపాలెంలో పార్వతీదేవిగా



మార్కాపురం : జమ్మనపల్లె ముద్దసానమ్మ దేవాలయంలో సామూహిక కుంకుమ పూజ



గిద్దలూరులో అన్నపూర్ణాదేవిగా

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

ఆలయాల్లో దసరా నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం మార్కాపురం పట్టణంలో ప్రముఖ చెన్నకేశవస్వామి ఆలయంలో కొమరోలులో ధాన్యలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. బేస్తవారపేట, పుల్లలచెరువులో త్రిపురసుందరీదేవిగా, కంభంలో గజలక్ష్మీదేవిగా, ధనలక్ష్మీగా, గిద్దలూరులో అన్నపూర్ణగా, యర్రగొండపాలెంలో పార్వతీదేవిగా త్రిపురాంతకంలో దుర్గ అలంకారంలో దర్శనమిచ్చారు. మార్కాపురం మండలంలోని జమ్మనపల్లెలోని ముద్దసానమ్మ గండి అమ్మవారి దేవాలయంలో చండీ యాగం నిర్వహించారు. అనంతరం సామూహిక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే బృందం



పుల్లలచెరువు : శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా



బేస్తవారపేట : సోమవారపేటలో త్రిపురసుందరీదేవిగా



అన్నపూర్ణాదేవిగా వాసవీమాత



కంభం : ధనలక్ష్మీదేవిగా



జాతీయ రహదారి 544-డికి చెందిన వేములకోట పరిధిలోని కోమటికుంటలోని కూడలి

కూడళ్లా.. మృత్యుపాశాలా?

❖ ప్రమాదాలకు అడ్డాగా మారిన జాతీయరహదారి
❖ గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు

కాలం	డివిజన్	మండలాలు	ప్రమాదాలు	మృతులు	గాయపడ్డవారు
ఐదేళ్లలో	మార్కాపురం	13	1143	435	1217

❖ జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో చింతకుంట సమీపంలో ఓ బాలుడు మృతిచెందారు.
❖ రెండు ఏళ్ల కిందట కోమటికుంట వద్ద నికరంపల్లెకు చెందిన భార్యభర్తలను లారీ ఢీ కొట్టడంతో మృతి చెందారు.
❖ కోమటికుంట సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కంభానికి చెందిన వ్యక్తిని వాహనం ఢీ కొని మృతిచెందారు.
❖ రెండు ఏళ్ల కిందట మిట్టమీదపల్లె అడ్డరోడ్డు వద్ద ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు.
❖ తిప్పాయపాలెం వద్ద కారు చెట్టును ఢీ కొట్టడంతో ఓ ఉద్యోగి మృతి చెందారు.
❖ తిప్పాయపాలెం వద్ద గేదెలు ద్విచక్ర వాహనానికి అడ్డురావడంతో రహదారిపై పడిన వ్యక్తిపై లారీ వెళ్లడంతో మృతిచెందారు.
❖ ఈ ఏడాది జులైలో తిప్పాయపాలెం వద్ద రహదారిపై గేదెలు అడ్డురావడంతో విజయవాడ నుంచి కడప వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడి ఇద్దరూ మృతిచెందారు.
❖ గత నెలలో తిప్పాయపాలెం వద్ద రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతిచెందారు.

మార్కాపురం, న్యూస్‌టుడే

జాతీయ రహదారిపై ఉన్న కూడళ్లు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. నిర్మాణంలో లోపం, వాహనచోదకుల నిర్లక్ష్యం, అతి వేగం కారణంగా విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ రహదారులు మృత్యుపిలుపులు మారాయి. మార్కాపురం మండలంలోని అమరావతి- అనంతపురం జాతీయ రహదారిపై ఉండే మిట్టమీదపల్లె అడ్డరోడ్డు, తిప్పాయపాలెం, చింతకుంట కూడలి, వేములకోట పరిధిలో ఉన్న కోమటికుంట కూడలిలో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గడిచిన మూడు ఏళ్ల కాలంలో ఈ మూడు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలు, కారు- ఆటో ఢీ, బస్సు లారీల ప్రమాదాలు, రహదారిపై గేదెలు అడ్డురావడంతో వాహనాలుబోల్తా పడి పలువురు ప్రాణాలు కోల్పోయారు.

తీసుకోవాల్సిన చర్యలు ఇవే... జాతీయ రహదారిపై కూడళ్ల వద్ద అటు, ఇటు వైపు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. కూడలి వద్ద ఏర్పాటు చేసే విద్యుత్తు దీపాలు తప్పని సరిగా వెలిగేటట్లు అధికారులు చూడాలి. కూడలిలో జాతీయ రహదారిపైకి వచ్చే వాహనాలు ద్విచక్ర వాహనాలు, కాలిబాటన వచ్చే ప్రయాణికులు కనిపించడం లేదు. అధికారులు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న మిట్టమీదపల్లె అడ్డరోడ్డు, చింతకుంట, కోమటికుంట కూడలిలో భారీ స్థాయిలో ఉన్న ఎల్ఈడీ విద్యుత్తు దీపాలు, సూచికలు ఏర్పాటు చేయాలని పలువురు సూచిస్తున్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత లోపం ఉంటే సరిచేయాలని, విస్తరించే అవకాశముంటే చూడాలని కోరుతున్నారు. వాహన చోదకులు వాహనాలను కూడలి వద్ద నిదానంగా నడపాలని, పాదచారులు, ప్రయాణికులు నిర్లక్ష్య తగదని అధికారులు పేర్కొంటున్నారు. గేదెలను, పశువులను రహదారిపై వాటి యజమానులు వదిలేయకుండా చూసుకోవాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాటిని రహదారులపై విడవకూడదని సూచిస్తున్నారు.



ఈ ఏడాది జులై నెలలో తిప్పాయపాలెం వద్ద బోల్తా పడిన బస్సు

మండలం	రహదారి	ప్రమాదాల ప్రాంతాలు	మృతులు	గాయపడ్డవారు మూడేళ్లలో..
మార్కాపురం	జాతీయరహదారి 544-డి	మిట్టమీదపల్లె అడ్డరోడ్డు, తిప్పాయపాలెం చింతకుంట, కోమటికుంట ప్రధాన కూడలి	20	50

ప్రమాదకర గుంతలతో అవస్థలు



గుంతలమయమైన రహదారి

కంభం, న్యూస్‌టుడే : కంభం నుంచి తురిమెళ్ల మీదుగా గిద్దలూరు వెళ్లే ప్రధాన రహదారి పలు చోట్ల గుంతలమయంగా ఉంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దేవనగరం సమీపంలో రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పలువురు వాహనదారులు అక్కడ కిందపడి గాయపడుతున్నారు. చిన్నకంభం జగనన్న కాలనీ సమీపంలోనూ గుంతలు ఏర్పడ్డాయి. నల్లకాలువ సమీపంలో దమ్ముచక్రాలు తిరగడంతో అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్పించాలని కోరుతున్నారు. రహదారిని, ప్రతిపాదనలు పెట్టిన జాబితాలను పరిశీలిస్తానని రహదారులు భవనాల శాఖ డీఈ నరసింహులు తెలిపారు.

తీసుకెళ్లారు.. పక్కన పడేశారు



పాతాళనాగేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో మూలన పడేసిన నిచ్చెన

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు నగర పంచాయతీలో వీధిదీపాలు మర్మతులు చేసే సమయంలో వినియోగించే నిచ్చెనను గత ఏడాది శివరాత్రి సమయంలో పాతాళనాగేశ్వరస్వామి దేవస్థానం కమిటీ నిర్వాహకులు తీసుకెళ్లారు. ఆ సమయంలో దేవస్థానం నిచ్చెనను వినియోగించడం తెలియక విరగగొట్టి పక్కన పడవేశారు. మరమ్మతులు చేయించి నగర పంచాయతీ అందించకుండా అలాగే వదిలివేశారు. రూ.2లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఈ నిచ్చెనను తిరిగి స్వాధీనం చేసుకోకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గిద్దలూరులోని ఆర్టీసీ బస్టాండు నుంచి కుమ్మరాం కట్ట వరకు ఉన్న వీధి దీపాలు మరమ్మతులు చేపట్టేందుకు నిచ్చెన లేక సిబ్బంది మరమ్మతులు చేపట్టలేని పరిస్థితి నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.



ముమ్మరంగా పొగనాట్లు

మార్కాపురం నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షానికి రైతులు ముమ్మరంగా పొగనాట్లు వేస్తున్నారు. ఒక పక్క బోర్డు అధికారులు ఎక్కువ సాగుతో పాటు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించినప్పటికీ రైతులువెనక్కు తగ్గడం లేదు. గత సంవత్సరం ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఖర్చులు పెరిగినా నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. – న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
కంభం : 8008632343
పొదిలి : 8008550360

కంభం, న్యూస్‌టుడే :



సమస్య: కందులాపురం పంచాయతీ పరిధిలో రైల్వే స్టేషన్‌కు వెళ్లే రహదారికి రెండు వైపులా ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వాహనం వస్తే పక్కకు తప్పుకునే సమయంలో ముళ్లచెట్ల కొమ్మలు తగిలి ముళ్లు గుచ్చుకుంటున్నాయి. వాటిని తొలగించాలి.
– బాష, కంభం

సమాధానం : రహదారిని పరిశీలించి రహదారిపైకి వచ్చిన ముళ్లచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– వీరభద్రాచారి, ఎంపీడీవో, కంభం

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

సమస్య: కొనకనమిట్ల మండలంలోని చౌటపల్లె- వద్దిమడుగు రహదారిపై కంకర పరిచి తారు వేయకుండా వదిలేశారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – శ్రీనువాసులు, వద్దిమడుగు
సమాధానం: తర్వలో రహదారి పనులు చేపడతాం
. శ్రీనువాసరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ

ఆక్రమణలు తొలగవు.. పూడికతీత సాగదు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే : యర్రగొండపాలెం పంచాయతీలో డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వర్షం పడితే చాలు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువల్లోని మురుగునీరంతా రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. కాలువల్లో పూడిక తీత చేపట్టాల్సిన పంచాయతీ అధికారుల వ్యవహారం విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో పనులు చేపట్టకుండా ఊరు బయట ఉన్న ప్రభుత్వ వైద్యశాల వద్ద మాత్రమే శుభ్రం చేయిస్తుండటంతో ప్రజలు అసహనం వ్యక్తమవుతోంది. ఊరు బయట ఒక తీరు ఊర్లో ఒక తీరు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కాలువలు చెత్తతో నిండి దోమలకు నిలయంగా



చెత్త తొలగించే అవకాశం లేకుండా కాలువపై కట్టడాలు

మారి వ్యాధుల వ్యాప్తికి కారణమౌతున్నాయని వాపోతున్నారు. గత ప్రభుత్వ హయంలో పలువురు మురుగు కాలువను ఆక్రమించి స్లాబ్‌లు వేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. వీరికి ఇబ్బంది కలుగకూడదనే పట్టణంలోని కాలువ జోలికి అధికారులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో అప్పటి రాజకీయనాయకులతో అంటకాగిన అధికారులే నేటికి ఇక్కడ రాజ్యమేలు తున్నారని, వీరి కారణంగానే కనీస పారిశుద్ధ్య చర్యలు తీసుకోలేని దుస్థితి నెలకొందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పట్టణంలోని కాలువపై అక్రమ కట్టాలను తొలగించి పూడిక తొలగించాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డిని సంప్రదించగా పట్టణంలో మురుగు కాలువలపై కట్టడాలు తొలగించి పూడిక పనులు చేపట్టాలంటే పై అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉందని పేర్కొనటం గమనార్హం.

శిథిలావస్థలో భవనాలు



విద్యుత్తు శాఖ ఏడీ కార్యాలయ ఆవరణలో కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు

కంభం, న్యూస్‌టుడే : విద్యుత్తు శాఖ ఏడీ కార్యాలయ ఆవరణలోని పలు భవనాలు శిథిలావస్థకు చేరాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డుకు సమీపంలో ఉన్న కొన్ని భవనాలు తొలగించారు. దీంతో వెనుక వైపు ఉన్న వాటికి మరమ్మతులు చేయించుకొని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మరికొన్నింటిని బాగు చేయకపోవడంతో అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. కార్యకలాపాలు నిర్వహిస్తున్న భవనాలు తక్కువ ఎత్తులో ఉండడం, కార్యాలయ పరిసరాల్లో ముళ్లచెట్లు పెరిగిపోయి అపరిశుభ్రంగా ఉండడంతో విషపురుగులు వస్తున్నాయి. వాటిల్లో విధులు నిర్వహించేందుకు సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి పాతవాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని కోరుతున్నారు. కార్యాలయ ఆవరణలో ఉన్న ముళ్ల చెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఏడీ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

మార్కాపురం: దసరా.. దీపావళి పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సెలవుల సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల నృత్యాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండగ సందర్భంగా బాణా సంచాను విక్రయం చేయాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని, ఎవరైనా అనధికారికంగా విక్రయించినా సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో సీఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాల జప్తు

మార్కాపురం : ఎవరైనా అక్రమంగా ఇసుకను రవాణా చేసినా, అనుమతి లేకుండా అమ్మకాలు సాగించినా కఠిన చర్యలు తప్పవని మార్కాపురం భూగర్భ గనులశాఖ ఏడీ విష్ణువర్ధనరావు పేర్కొన్నారు. శని, ఆదివారం మార్కాపురం భూగర్భ గనులశాఖ అధికారులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వాహనాలను సీజ్ చేశారు .వాహనాల యజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన టిప్పర్ లారీ అక్కడ ఇసుకను బుకింగ్ చేసుకొని మార్కాపురం ప్రాంతంలోకి తెచ్చి విక్రయం చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నామని, మార్కాపురం పట్టణంలో ఇసుకను అన్‌లోడు చేస్తున్న ట్రాక్టరును, కనిగిరి- చిన్నారుట్ల గ్రామాల మధ్య ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకొని అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. అయితే దాడుల్లో పట్టుబడిన వాహనాలు కాకుండా మరో మూడు టిప్పర్లు, ఒక లారీ, ఒక ట్రాక్టరును రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు అధికారులు వదిలేసినట్లు సమాచారం. పట్టుబడిన అయిదు వాహనాలు మార్కాపురం ఆర్టీసీ డిపో నుంచి బయటకు వెళ్లిపోయినట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో కాడెద్దులు మృతి

మార్కాపురం, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో కాడెద్దుల మృతి చెందిన సంఘటన ఆదివారం పెద్దనాగులవరంలో చోటుచేసుకుంది. బొమ్మనబోయిన కాశీరావు వ్యవసాయ పనులు చేసేందుకు ఎద్దులను పొలానికి తోలుకెళ్లారు. పని పూర్తయ్యాక మేత కోసం వాటిని సమీపంలో వదిలారు. ఎద్దులు మేత మేస్తూ పొలంలో ఉన్న విద్యుత్తు పరివర్తకం వద్దకు వెళ్లాయి. ఒక ఎద్దు విద్యుదాఘాతానికి గురైంది. దాన్ని తాకినమరో ఎద్దుకు విద్యుత్తు సరఫరా కావడంతో కిందపడి పోయింది. అప్రమత్తమైన కాశీరావు విద్యుత్తు అధికారులకు సమాచారం అందజేసి ఎద్దులను కాపాడుకునేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది. వ్యవసాయానికి ఆదరువుగా ఉండే రెండు ఎద్దులు మృతిచెందడంతో తల్లడిల్లిపోయారు. ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

బొప్పరాజుకు ఘన సత్కారం

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా వీఆర్వోల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లును ఆదివారం పొదిలి మండల వీఆర్వోలు ఘనంగా సత్కరించారు. ఓ శుభకార్యం నిమిత్తం కర్నూలు వెళుతున్న ఆయన పొదిలిలో కొంత సేపు ఆగారు. ఈ సందర్భంగా వీఆర్వోలు కలిసి ఆయనతో ముచ్చటించారు. అనంతరం వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

జూదరుల అరెస్టు : గిద్దలూరు పట్టణం : గిద్దలూరు మండలం దంతెరపల్లె గ్రామంలో ఆదివారం సాయంత్రం జూదమాడుతున్న నలుగురిని గిద్దలూరు సీఐ సురేష్ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.9,300 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువల నిర్మాణం చేపట్టాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌డీ.హనీఫ్

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : అన్ని వీధుల్లో కాలువల నిర్మాణం చేపట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌డీ. హనీఫ్ డిమాండ్ చేశారు. ఆగిద్దలూరు సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. గిద్దలూరు మీదుగా కడప జిల్లాకు వెళుతున్న కాలువ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు, గ్రామాలకు తాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆవులయ్య, రాజశేఖర్, మూర్తి, నరసింహ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



డ్రిప్‌తో అందించాల్సిన రసాయనిక ఎరువును చేత్తో చల్లుతున్న రైతు

రీ సర్వేతో రైతుకు తిప్పలు

❖ సమస్యలు పరిష్కరిస్తేనే ఊరట ❖ కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే :

గత వైకాపా ప్రభుత్వం జగనన్న భూహక్కు.. భూరక్ష పథకం ద్వారా తీసుకొచ్చిన రీ సర్వే రైతులకు కష్టాన్ని తెచ్చిపెట్టింది. అసమగ్రంగా తెచ్చిన ఆ పథకం ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చకపోగా రైతులకు శాపంగా మారింది. ఒక సర్వే నెంబరులో పలువురు రైతులు ఉన్నారు. ఆ భూమిని సర్వే చేసి అతనితో పాటు సర్వే నంబరులో ఉన్న రైతులందరినీ సంయుక్త ఎల్పీ కింద నమోదు చేయడంతో ఉన్న భూ విస్తీర్ణం మొత్తం అంతా వన్-బి అడంగల్‌లో చూపిస్తుంది. దీంతో 90 శాతంపైగా సన్న, చిన్న కారు రైతులకు అందిస్తున్న డ్రిప్ పరికరాలకు నోచుకోలేకపోతున్నారు. ప్రభుత్వం రైతులకు వివిధ రాయితీల వర్తింపుతో పాటు నష్టపరిహారం, బీమా ఇతర సదుపాయాలన్నింటినీ కోల్పోతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

త్రిపురాంతకం మండలం కంకణాలపల్లి, సోమేపల్లి, కొత్త ముడివేముల, పాత ముడివేముల, పాపన్నపాలెం, డీవీఎన్ కాలనీ, ఒడ్డుపాలెం, మిరియంపల్లి, గాంధీనగర్, మాధవానిపల్లి, దువ్వలి, విశ్వనాథపురం గ్రామాల్లో భూముల రీ సర్వేను చేపట్టింది. సక్రమంగా సర్వే చేయకపోవడంతో భూ వివరాల్లో చాలా తప్పులు దొర్లాయి. చాలా మంది రైతులకు చెందిన భూ వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. ప్రభుత్వ భూముల్లో సాగు లోని రైతులకు చెందిన ఆన్‌లైన్‌ను సర్వే బృందానికి నేతృత్వం వహించిన ఓ అధికారి ఆదేశాలతో తొలగించడంతో ఆ రైతులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. చాలా చోట్ల పొలం విస్తీర్ణం లోనూ తేడాలు ఉన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరా భూమికి గాను రీ సర్వేలో 80 సెంట్లు చూపించారు. రీ సర్వే జరిగిన అన్ని గ్రామాల్లోనూ చాలా మంది రైతుల పొలాలు విస్తీర్ణాలు తగ్గించి నమోదు చేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. నూతనంగా కొలువు తీరిన కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీ సర్వేలో తలెత్తిన లోపాలను సవరించి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రాయితీకి నోచుకోలేకపోయా..



నాకు 847 సర్వే నంబరులో ఎకరన్నర పొలం ఉంది. ఆ పొలంలో మిర్చి సాగు చేశా. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా నీటి తడులు అందిద్దామని ప్రభుత్వం అందిస్తున్న రాయితీ డ్రిప్ కోసం దరఖాస్తు చేసేందుకు వన్‌బీ అడంగల్ ఆన్‌లైన్‌లో తీయగా ఆ సర్వే నంబరులో ఎ.10.24 సెంట్లు నా పేరు మీద ఉన్నట్లు చూపిస్తోంది. దీంతో సన్న-చిన్న కారు రైతు పరిధిలోకి రానంటూ నా దరఖాస్తును తిరస్కరించారు.
– మాదంశెట్టి శ్రీను, రైతు, సోమేపల్లి, త్రిపురాంతకం

లోపాలు సరిదిద్దుతాం

ప్రభుత్వం కొత్తగా చేపట్టనున్న రీ సర్వే ద్వారా లోపాలను సరి చేస్తాం. రైతులకు ఎక్కడా అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, తహసీల్దారు, త్రిపురాంతకం

ఒకరికి వెలుగులు.. మరొకరికి చీకట్లు



జగనన్న కాలనీకి వేసిన విద్యుత్తు లైను

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే : నా ఎస్టీ, నా ఎస్సీ, నా బీసీలు అంటూ చెప్పుకునే వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్టీ కాలనీకి విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించలేకపోయారు. మండలంలోని మేడపి ఎస్టీ వాసులకు 2014లో తెదేపా హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా పలువురు ఎస్టీలకు పక్కా గృహాలు మంజూరు కాగా 20 మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు. 2019లో అధికారం చేపట్టిన వైకాపా ప్రభుత్వం ఎన్టీఆర్ పక్కా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారుల పక్కన మరో 20 మందికి జగనన్న కాలనీ పేరుతో గృహాలను నిర్మించారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతుంటే అప్పటికప్పుడు స్తంభాలను పాతి మూడు లైన్లను ఏర్పాటు చేసి పరివర్తకాన్ని అమర్చి విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించారు. తమకు కూడా విద్యుత్తు సౌకర్యాన్ని కల్పించాలని పక్కనే ఉన్న ఎన్టీఆర్ గృహాల వాసులు అధికారులను బతిమిలాడినా ఎస్టీలపై కరుణ చూపించలేదు. దీంతో విద్యుత్తు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



విద్యుత్తు స్తంభాలకు నోచుకోని ఎన్టీఆర్ కాలనీ

కనిగిరి
•కనిగిరి •దర్శి •కొండపి

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

కురిచేడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని బయ్యవరం ఎస్సీ కాలనీ ప్రధాన వీధిలో కాలువలు ఏర్పాటు చేయకపోవడం వల్ల నివాసాల్లో నుంచి వచ్చే మురుగుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీంతోపాటు కాలనీలో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. – మరియదాసు, స్థానికుడు

సమాధానం: త్వరలోనే కాలువలు నిర్మించి, వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి

తాళ్లూరు, న్యూస్‌టుడే:

సమస్య: తాళ్లూరు శివారు పడమటబజారులో ప్రధాన రహదారిని సీసీ రోడ్డుగా అభివృద్ధి పర్చారు. పక్కన కాలువలను నిర్మించినా అవి పూడికలతో నిండిపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతుంది. దీనివల్ల దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. –వెంకటేశ్వర్లు, స్థానికుడు

సమాదానం : వెంటనే సమస్యను పరిశీలించి త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. –సుందరరామయ్య, ఈవోఆర్డీ

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని వేమవరం బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి పూట చీకట్లో తిరగాల్సి వస్తోంది. –బాలగురవయ్య, స్థానికుడు

సమాధానం: కాలనీలో పరిశీలించి రెండు రోజుల్లో వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. –నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి

పీసీపల్లి, న్యూస్‌టుడే:



సమస్య : మండలంలోని మెట్లవారిపాలెం గ్రామానికి వెళ్లే మట్టి రహదారిలో గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వర్షం కురిసిన సమయంలో వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఎదురవుతోంది. తారు రోడ్డు నిర్మించాలి. –స్థానికులు

సమాధానం : జిల్లా ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. –ప్రభాకర్ శర్మ, ఏవో ఎంపీడీవో కార్యాలయం

ఇనగలేరుపై వంతెన నిర్మించాలని సీపీఎం డిమాండ్

టంగుటూరు, న్యూస్‌టుడే: పొందూరు-కొణిజేడు గ్రామాల మధ్య ఉన్న ఇనగలేరు వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. పొందూరులో సీపీఎం శాఖ 15వ మహాసభలను ఆదివారం నిర్వహించారు. ముందుగా పరిటాల కోటయ్య స్థూపం వద్ద జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ముసి, ఇనగలేరు వాగులపై వంతెనలు లేక వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయన్నారు. పొందూరు-ఎం.నిడమానూరు గ్రామాల మధ్య మంగళి వాగుపై వంతెన నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో వేజెండ్ల హనుమంతరావు, రాము, మోజెస్, వెంకటరత్నం, రమేష్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత వ్యాపకం.. సమాజ హితం

● ప్రజోపయోగ పనులతో మన్ననలు పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు

ప్రతి ఉద్యోగి జీవితంలో విశ్రాంత ఘట్టమే ముఖ్యం. ఎందుకంటే అప్పటికే పిల్లలు పెద్దవారవుతారు, వారికి పెళ్లిళ్లు అయిపోతాయి. కొందరు తల్లిదండ్రులకు దూరంగానూ ఉండవచ్చు. ఇలాంటి సందర్భాల్లో తాము ఒంటరిగా ఉండిపోయామనే భావన చాలామందిలో ఉంటుంది. వీటిని అధిగమించేందుకు కనిగిరి నియోజకవర్గానికి చెందిన కొందరు విశ్రాంత ఉద్యోగులు కొత్తబాటను ఎంచుకున్నారు. తమ ఖాళీ సమయాన్ని పరుల సేవకు ఉపయోగిస్తూ పలువురి మన్ననలు పొందుతున్నారు. వారి అవిశ్రాంత సేవలను ఇప్పుడు తెలుసుకుందాం. - న్యూస్‌టుడే, కనిగిరి



కనిగిరిలో ఏర్పాటు చేసుకున్న కార్యాలయంలో సమావేశమైన విశ్రాంత ఉద్యోగులు(పాతచిత్రం)

బ్యాంకులో తోటివారికి సాయం చేస్తూ..



కనిగిరి పట్టణం పాతకూచిపూడిపల్లికి చెందిన తమ్మినేని పెద్దిరెడ్డి మండల ఆరోగ్య విస్తరణాధికారిగా పనిచేసి 20 ఏళ్ల క్రితమే ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగుల సంఘం కనిగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. బ్యాంకుల వద్ద విశ్రాంత ఉద్యోగులకు వివిధ ఫారాలు పూర్తి చేసి ఇస్తుంటారు. కనిగిరితో పాటు ఆరు మండలాల్లోని విశ్రాంత ఉద్యోగులు, పింఛనుదార్లకు తెలియని విషయాలపై అవగాహన కల్పిస్తూ అందరికీ తలలో నాలుకలా మారారు. తనకు తోచిన సాయం చేస్తూ మలిసంధ్యలో ఆనందంగా కాలం గడుపుతున్నానంటున్నారు పెద్దిరెడ్డి.

కవితలు, పుస్తకాలు రాస్తూ..



కనిగిరి పట్టణంలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన కొండ్రెడ్డి నాగిరెడ్డి పీసీపల్లి మండలం గుంటూరు లింగనపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి 25 ఏళ్ల క్రితమే ఉద్యోగ విరమణ చేశారు. తనకు ఇష్టమైన సాహిత్యంపైపు దృష్టి సారించారు. కవితలు, పుస్తకాలు రాస్తూ సమాజంలో చెడును, మంచిని తన కవిత్వం ద్వారా చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. తాను రాసిన కవితలకు అవార్డులు కూడా వచ్చాయి. సత్కారాలు సైతం అందుకున్నారు. ఉపాధ్యాయుడిగా పొందిన ఆనందం కంటే కవిగా ఎక్కువ సంతోషం కలుగుతోందని ఆయన చెబుతున్నారు.

పొగాకు రైతులకు అండగా నిలుస్తూ..



కనిగిరి మున్సిపాలిటీలోని మాచవరానికి చెందిన కాసు వెంకటేశ్వరరెడ్డి పట్టణంలోని ఎల్ఎంకే ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి 20 సంవత్సరాల క్రితమే ఉద్యోగ విరమణ పొందారు. పుట్టింది రైతు కుటుంబంలో అయినందున వ్యవసాయం అంటే చిన్ననాటి నుంచే ఆయనకు ఆసక్తి. అందులో పొగాకు సాగు అంటే మరింత మక్కువ. కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ సమయంలో తనకు ఇష్టమైన వ్యవసాయాన్ని వ్యాపకంగా మార్చుకున్నారు. పొగాకు రైతుల సంఘం నాయకుడిగానూ పనిచేస్తూ వారికి అనేక విషయాలపై సూచనలు సలహాలిస్తుంటారు.

ఉపాధ్యాయ సమస్యలపై గళమెత్తుతూ..



కనిగిరి పట్టణం కొత్తపేటకు చెందిన మీగడ వెంకటేశ్వరరెడ్డి స్థానిక చింతలపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసి పది సంవత్సరాల క్రితమే ఉద్యోగ విరమణ చేశారు. అప్పట్లో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగానూ పని చేశారు. ప్రస్తుతం గౌరవ సలహాదారుగా ఉంటూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్నారు. విశ్రాంత జీవితంలోనూ ఉపాధ్యాయుల పక్షాన నిలిచి సేవలందించడం ఎంతో ఆనందంగా ఉందంటున్నారాయన.

ఇంట్లోనే స్టడీ సెంటర్ ఏర్పాటు చేసి..



కనిగిరి పట్టణం కేసన్నపల్లివారి వీధికి చెందిన గంథం దైవకటాక్షం మండలంలోని కంఠంవారిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. పిల్లలందరికీ పెళ్లిళ్లు చేశారు. వారు ఉద్యోగ రీత్యా స్థిరపడ్డారు. తర్వాత ప్రభుత్వం ద్వారా వచ్చే పింఛనులో ఏడాదికి కొంత నగదును పేద పాస్టర్లు, ప్రజలకు అందిస్తూ వారికి తోడుగా నిలుస్తున్నారు. దీంతో పాటు ప్రత్యేకంగా తన నివాసంలోనే పాస్టర్స్ బైబిల్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేశారు. శాంతి వచనాలు బోధిస్తుంటారు.

వైద్య సేవలు అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి, వేదికపై మాజీ ఎమ్మెల్యే పాపారావు, లలితసాగర్ తదితరులు

దొనకొండ, న్యూస్‌టుడే: ప్రజలకు వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని దర్శి నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. దొనకొండలోని ఆర్సీఎం పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. గుంటూరు సమీపంలోని పెదకాకానిలో ఉన్న శంకర కంటి ఆసుపత్రి వైద్యులు జగ్గారి, వరదరాజ్ 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారన్నారు. 60 మందికి కంటి శస్త్రచికిత్సలు అవసరమని, కొద్ది రోజుల్లో తమ వైద్యశాలకు వీరిని తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. ప్రతినెల ఒక్కో మండలంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అందరికీ అందేలా చూస్తామన్నారు. దివ్యాంగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. ఎలాంటి వైద్యం కావాలన్నా ఉచితంగా చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. వచ్చిన వారికి ఆమె ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి మున్సిపల్ వైస్ చైర్మన్ పిచ్చయ్య, తెదేపా నాయకులు లలితసాగర్, వెంకటచౌదరి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఊళ్లన్నారు.. ఆనక చేతులెత్తేశారు..!



మనం కడుతున్నది ఇళ్లు కాదు ఊళ్లు అని గత వైకాపా పాలకులు వేదికలపై ఊదరగొట్టారు. గ్రామాలకు దూరంగా జగనన్న కాలనీల పేరుతో లేఔట్లు ఏర్పాటు చేశారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి, పక్కా గృహాలను మంజూరు చేసినా అరకొర వసతుల మధ్య ఉండలేమని భావించి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. తాళ్లూరు శివారు కేవీపాలెం రహదారిలో దాదాపు 90 మందికి పక్కాగృహాల నిర్మాణానికి అవకాశం కల్పిస్తే కేవలం పది మందే నిర్మాణాలు పూర్తి చేశారు. మరికొందరు వివిధ దశల్లో పనులను ఆపేశారు. ఎక్కువ మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, గడ్డి, తుమ్మచెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. దీంతో గేదెలు, మేకలు, గొర్రెలను అక్కడికి తీసుకొచ్చి మేతకోసం వదులుతున్నారు. –న్యూస్‌టుడే, తాళ్లూరు

వాహనాలిలా.. వెళ్లేదెలా..!



కొండపి-టంగుటూరు రహదారిలోని యూనియన్ బ్యాంకు వద్ద నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురవుతున్నాయి. కొందరు రోడ్డుపైనే వాహనాలు నిలిపివేస్తున్నారు. దీనికి తోడు టిప్పర్లు, లారీలు, ఇతర భారీ వాహనాలు వచ్చినప్పుడు అక్కడ రద్దీ నెలకొంటుంది. మరో పక్క డివైడర్ ఉండటంతో వాహనాల రాకపోకల సమయంలో ప్రయాణికులు, పాదచారులు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ విషయంపై కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్‌ని వివరణ కోరగా.. బ్యాంకు సిబ్బందితో మాట్లాడి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

మంచినీటి పథకం.. నిరుపయోగం



మండల కేంద్రం హెచ్‌ఎంపాడులో రెండు దశాబ్దాల క్రితం పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన మంచినీటి పథకం ఏడాది నుంచి నిరుపయోగంగా మారింది. రెండు డీప్‌బోర్లను ఏర్పాటు చేసి ట్యాంకుకు నీరు విడుదల చేసేవారు. ప్రస్తుతం బోర్లు పనిచేయక, రూ. లక్షలు వెచ్చించి నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు కూడా నిరుపయోగమైంది. ఫలితంగా 3 వేల మంది జనాభాకు నీటి కష్టాలు తప్పడం లేదు. సాగర్ నీరు వారానికి ఒకసారి విడుదల చేస్తున్నా పైప్‌లైన్ లీకులతో కొన్ని వీధులకు సరిగా అందడం లేదు. ఇటీవల కొత్తగా కుళాయిలు ఏర్పాటు చేసి నిర్మించిన ట్యాంకు కూడా శిథిలస్థితికి చేరింది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. బోర్లు, పైపులు, ఓవర్‌హెడ్ ట్యాంకుల మరమ్మతుల బాధ్యత సర్పంచికి అప్పగించామని, తగు సూచనలిచ్చి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, హనుమంతునిపాడు

ధ్యానం.. ఆరోగ్య దాయకం



ధ్యానంవల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తున్న త్రిపుర

నిత్యం ధ్యానం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని కనిగిరికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ త్రిపుర వివరించారు. మండలంలోని నాగంబొట్లపాలెం బుద్ధ పిరమిడ్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ప్రజలు వివిధ రకాల ఒత్తిళ్లతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఆరోగ్యపరంగా చాలా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కొంత సమయాన్ని కేటాయించి ధ్యానం చేస్తే వ్యాధులు దరిచేరవని, ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని వివరించారు. ఎటువంటి నగదు ఖర్చు లేకుండా కలిగే ప్రయోజనాలను అందరూ పొందాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకురాలు ఎం.విజయలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, తాళ్లూరు



కొండపి శివాలయంలో పార్వతీదేవికి అలంకరణ



తాళ్లూరు: మహాలక్ష్మిగా గంగమ్మతల్లి



దర్శి: కనకదుర్గమ్మకు పొంగళ్లు సమర్పించేందుకు తరలివచ్చిన భక్తులు



కనిగిరి: వేంకటేశ్వర స్వామి ఆలయంలో లలిత సహస్రనామ పారాయణం చేస్తున్న మహిళలు



టంగుటూరు: శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా వల్లూరమ్మ



సింగరాయకొండగ్రామీణం: జాలమ్మతల్లికి అలంకరణ



పామూరు: అన్నపూర్ణాదేవిగా వాసవీమాత

అమ్మా.. జగదాంబ!

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం కనిగిరి, దర్శి, కొండపి నియోజకవర్గాల్లోని పట్టణాలు, గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీలలితా త్రిపుర సుందరీదేవి, అన్నపూర్ణాదేవి, బాలా త్రిపుర సుందరీదేవి, శాకంబరి, మహాలక్ష్మి, కాళికామాత తదితర రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో అంతటా జగన్మాత నామస్మరణ మార్మోగింది. మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో గోపూజ నిర్వహించారు. కనిగిరి వేంకటేశ్వర దేవస్థానంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. పల్లకీ సేవ నిర్వహించారు. 101 మంది దంపతులు సామూహిక కల్యాణాలు చేశారు. –న్యూస్‌టుడే, బృందం

భారీ వాహనాలు.. అడ్డదారులు



చీమకుర్తి–కొండపి–టంగుటూరు మార్గంలో 16వ జాతీయ రహదారికి చేరుకునేందుకు బండరాళ్లతో వస్తున్న టిప్పర్

● టోల్ రుసుము ఎగ్గొట్టేందుకు పల్లెల మీదుగా రవాణా

న్యూస్‌టుడే, టంగుటూరు

ఆ గ్రామాల్లో టిప్పర్ల హారన్లు మోత మోగిస్తున్నాయి. జాతీయ రహదారిపై నుంచి వెళ్లాల్సిన వాహనాలు గ్రామాల్లోకి రావడంతో ప్రయాణికులు, ఆటోలు, ద్విచక్ర, ఇతర వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. పెద్ద పెద్ద రాళ్లతో భారీగా లోడు వేసుకొని, అత్యంత వేగంతో దూసుకెళ్తున్నాయి. చీమకుర్తి నుంచి నెల్లూరుకు గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న వాహనాలు టంగుటూరు వద్ద టోల్‌ప్లాజా రుసుము తగ్గించుకునేందుకు ఈ వక్ర మార్గాన్ని ఎంచుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పల్లెల్లోకి భారీ వాహనాలు రాకుండా అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

● టోల్ ఫీజు ఎగ్గొట్టేందుకు వాహన చోదకులు అడ్డదారులను ఎంచుకుంటున్నారు. అనుమతులు లేని రహదారులపై భారీ లోడుతో యథేచ్ఛగా బండరాళ్లను రవాణా చేస్తున్నారు. తద్వారా రోడ్లు ఛిద్రమవుతున్నాయి. చీమకుర్తి నుంచి బండరాళ్లను నెల్లూరు మార్గంలో భారీ వాహనాల ద్వారా తరలిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ఈ వాహనాలు వెళ్తున్నాయి. సాధారణంగా అయితే చీమకుర్తి నుంచి ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండ, ఉలవపాడు మీదుగా 16వ జాతీయ రహదారిపై నుంచి వెళ్లాలి. ఈ మార్గంలో బండరాళ్లను తరలిస్తే అధిక దూరమవుతోందని, టోల్ రుసుము కూడా చెల్లించాలి, అధిక బరువు ఉంటే టోల్ రుసుముతో పాటు అదనంగానూ చెల్లించాలి. ఇదంతా ఒక ఎత్తయితే జాతీయ రహదారిపై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు నిత్యం పహారా కాస్తున్నారు. వాహనాలను నిలిపి సంబంధిత పత్రాలు లేకపోతే రూ.వేలల్లో అపరాధ రుసుము వేస్తారు. ఈ నేపథ్యంలో 16వ జాతీయ రహదారిపైనుంచి నేరుగా రవాణా చేయడం లేదు. వీటన్నింటి నుంచి తప్పించుకునేందుకు చీమకుర్తి, కొండపి, టంగుటూరు మార్గంలో ప్రయాణించి దర్జాగా భారీ వాహనాలను రామాయపట్నం చేరుస్తున్నారు. భారీ లోడుతో వాహనాలు తిరుగుతున్నందున చీమకుర్తి-కొండపి-టంగుటూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇప్పటికే ఛిద్రమైంది. పలు గ్రామాల పరిధిలో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ వాహనాలు ఈ మార్గంలో రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.జగదీష్‌ను వివరణ కోరగా.. బండరాళ్లు తరలిస్తున్న భారీ వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టి అక్రమ మార్గాల్లో వెళ్తే అపరాధ రుసుము విధిస్తామని తెలిపారు.

నేడు మీకోసం కార్యక్రమానికి మంత్రి స్వామి రాక

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించే మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి హాజరవుతారని తహసీల్దార్ టి.రవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలపై మంత్రి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

కనిగిరి, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని కాశిరెడ్డినగర్‌లో చిత్తుకాగితాలు ఏరుకునేవాళ్లు, బిచ్చగాళ్లు, నిరుపేద పిల్లలకు మొత్తం 35 మందికి మున్సిపల్ ఛైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ సొంత ఖర్చులతో ఆదివారం క్షవరం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంతో పాటు శివారు ప్రాంతాల్లో చాలా మంది నిరుపేదలు గడ్డం, జుట్టు పెంచుకుని చూసేందుకు ఇబ్బందికరంగా ఉన్నారన్నారు. అందుకే ఇలాంటి వారిని తీసుకొచ్చి క్షవరం చేయించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని సూచించారు.

పోలీసుల అదుపులో జూదరులు

టంగుటూరు: జూదమాడుతున్న ఏడుగురు వ్యక్తులను టంగుటూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని సూరారెడ్డిపాలెం శివారున డంపింగ్ యార్డ్ వద్ద జూదం ఆడుతున్నారనే సమాచారం ఎస్సై నాగమల్లేశ్వరరావు తన సిబ్బందితో దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.6,240 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



ముండ్లమూరు పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలు, గడ్డి



చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇదీ పరిస్థితి..

ఆసుపత్రులు.. అధ్వాన పరిస్థితులు

న్యూస్‌టుడే, తాళ్లూరు, దర్శి, ముండ్లమూరు

దర్శి నియోజకవర్గం పరిధిలోని అయిదు మండలాల్లో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లోని మూడు పీహెచ్‌సీల్లో మాత్రం అపరిశుభ్ర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో విషపురుగుల సంచారం, దోమల బెడద అధికంగా ఉంటోంది. ఇలాంటి పరిస్థితులవల్ల రాత్రివేళ విధులు నిర్వహించే సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు.

ఆవరణలో చిల్లచెట్లు, వ్యర్థాలు

మండల కేంద్రం తాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలతోపాటు ప్రహరీ వద్ద అపరిశుభ్రత నెలకొంది. చుట్టూ దట్టంగా పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగాయి. ఆసుపత్రి లోపలకు వచ్చిన వెంటనే పరిసరాలతోపాటు పడమరవైపు ఆవరణలో దుస్థితి నెలకొంది. ఈ కారణంగా తరచూ విష పురుగుల రాకతో సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. ప్రహరీ పక్కనే చెత్తాచెదారం వేస్తుండడంతో డంపింగ్‌యార్డును తలపిస్తోంది. మండలంలోని తూర్పుగంగవరం పీహెచ్‌సీ ఆవరణలోను చిల్లకంప, గడ్డి, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. ● దర్శి మండలం చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కూడా అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన డీప్‌బోరు చుట్టూ ముళ్లకంపలు పెరిగి అపరిశుభ్రంగా ఉంది. వీటితోపాటు పిచ్చిమొక్కలు, గడ్డికూడా మొలిచాయి. ● మండలకేంద్రం ముండ్లమూరులో గ్రామానికి దూరంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు కంపరంగా మారాయి. ఇక్కడి ఆవరణ కూడా అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత వైద్యాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టాలని రోగులు కోరుతున్నారు. దీనిపై ఆయా ఆసుపత్రుల వైద్యాధికారులను వివరణ కోరగా.. నిధుల కొరత కారణంగానే ఆసుపత్రిలో పనులు చేయించలేకపోయామన్నారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చిమొక్కలు బాగా పెరిగాయని, త్వరలోనే ఆవరణలను శుభ్రం చేయిస్తామని తెలిపారు.



తాళ్లూరు పీహెచ్‌సీలో ఇలా..

అగ్ని ప్రమాదంలో దుకాణం దగ్ధం

కురిచేడు, న్యూస్‌టుడే: పంక్చర్ దుకాణం దగ్ధమైన సంఘటన మండలంలోని పొట్లపాడులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పలుకూరి వెంకటరామయ్య కొన్నేళ్లుగా పంక్చర్ దుకాణం ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. షార్ట్ సర్క్యూట్ జరిగి పక్కనే ఉన్న టైర్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో దుకాణంలో ఉన్న అన్ని వస్తువులకు మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి తెలియజేయగా, వారు వచ్చి మంటలు అదుపు చేశారు. కుటుంబాన్ని పోషించుకోవడానికి ఉన్న ఏకైక ఆధారం ఇలా కాలి బూడిదపాలైందని వెంకటరామయ్య కన్నీరు మున్నీరయ్యారు.

తాగి వాహనం నడిపితే చర్యలు

హనుమంతునిపాడు: పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడం, మద్యం తాగి వేగంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం.మాధవరావు హెచ్చరించారు. ఆదివారం కనిగిరి - కంభం రహదారిలోని అడ్డరోడ్డు వద్ద ఆటోలు, ద్విచక్రవాహన చోదలకులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



పెయింటర్ కుటుంబానికి నగదు అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

దర్శి, న్యూస్‌టుడే: దర్శి ఎస్సీ కాలనీకి చెందిన పెయింటర్ గర్నెపూడి శివప్రసాద్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న దర్శి మానవత సంస్థ సభ్యులు అతడి కుటుంబానికి ఆదివారం ఆర్థిక సాయం చేశారు. సంస్థకు చెందిన దేవత వరప్రసాద్, నారాయణరెడ్డి ఒక్కొక్కరూ రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో దాతలతో పాటు సంస్థ సభ్యులు జనార్దనరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, వేణు, రాజకేశవరెడ్డి, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు


ఒంగోలు: గజలక్ష్మిగా అమ్మవారు


రాజరాజేశ్వరి అలంకరణలో..


ఎస్ఎన్‌పాడు: అన్నపూర్ణాదేవిగా...

అఖిలాండేశ్వరీ.. అభయ స్వరూపిణీ..

విజయదశమిని పురస్కరించుకుని దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆదివారం రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒంగోలు నగరంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మిగా, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గాయత్రిదేవిగా.. సంతనూతలపాడులోని త్రిపురాంతస్వామి దేవాలయంలో పార్వతి అమ్మవారు లలితా త్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సంతపేట సాయిబాబా మందిరంలో మురళీకృష్ణ బృందంచే అన్నమయ్య సంకీర్తన విభావరి నిర్వహించారు. లాయర్‌పేట సాయిబాబా మందిరంలో శ్రీ రాఘవ కూచిపూడి నృత్య కళా నిలయం ఆధ్వర్యంలో కరవది శ్రావ్య శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది.


– న్యూస్‌టుడే బృందం


ఎస్ఎన్‌పాడు: ప్రత్యేకాలంకరణలో పార్వతి అమ్మవారు


లాయర్‌పేట సాయిబాబా మందిరంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా గనులశాఖ అధికారి బి.రాజశేఖర్, ఒంగోలు ఆర్డీవో లక్ష్మీప్రసన్న ఆదివారం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.


ఎమ్మెల్యే జనార్దన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా గనులశాఖ అధికారి రాజశేఖర్

కలుషిత జలం.. గొంతులకు గరళం..

- సీపీడబ్ల్యూఎస్ పథకం నిర్వహణ గాలికొదిలేసిన గత ప్రభుత్వం
- శుద్ధి చేయకుండానే గ్రామాలకు తాగునీరు సరఫరా

సంతనూతలపాడు, న్యూస్‌టుడే

ఏడు గ్రామాల్లో వేలమందికి దాహార్తి తీర్చే పథకం అది. అయిదేళ్లు ఫిల్టర్ బెడ్లు బాగు చేయకపోవడం.. వచ్చిన డబ్బులు దోచుకోవడం తప్ప గత వైకాపా ప్రభుత్వం చేసిందేమీ లేదు. చివరికి ఫిల్టర్ బెడ్‌లోని ఇసుకను సైతం అమ్ముకున్న దుస్థితి. ఫలితం అన్నీ గ్రామాల్లో రంగుమారిన నీరు సరఫరా అవుతోంది. దాన్ని తాగి పలువురు జ్వరాల బారిన పడుతున్నా అధికారుల్లో చలనం లేకుండా పోయింది. ఇది మండలంలోని ఎనికపాడు సీపీడబ్ల్యూఎస్ పథకం పరిస్థితి.

అయిదేళ్లు.. నోచుకోని మరమ్మతులు..

ఎనికపాడు సీపీడబ్ల్యూఎస్ పరిధిలో ఎనికపాడు, గుమ్మళంపాడు, గంగవరం, బొడ్డువారిపాలెం, చంద్రపాలెం, తక్కెళ్లపాడు, మాచవరంలకు నీటిని సరఫరా చేస్తున్నారు. దీని కింద మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించడం, మంచినీటి చెరువును సాగర్ నీటితో నింపడం, ఎక్కడైనా పైపుల మరమ్మతులకు, ట్యాంకు నిర్వహణకు ఈ ఏడాది రూ.26లక్షల నిధులు కేటాయించారు. చెరువుల్లో నీరున్న ఫిల్టర్ బెడ్లు మాత్రం పనిచేయడం లేదు. అయిదేళ్ల నుంచి ఫిల్టర్ అయిన నీరు సరఫరా కాలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం సైతం రంగు మారిన, పురుగులు వస్తున్న నీరు సరఫరా అవుతుంది. ప్రభుత్వం మారడంతో ట్యాంకు నిర్వహణ కూడా మారుతుందా అని ఆయా గ్రామాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.


రంగు మారి వస్తున్న నీరు

సక్రమంగా లేని కుళాయిలు..

గ్రామాల పరిధిలో మంచినీటి వీధి కుళాయిలు సక్రమంగా లేవు. చాలా వరకు కుళాయిలకు తిప్పే వాల్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతుంది. గుమ్మళంపాడులో సుమారు 17 కుళాయిలు ఉండగా వీటిలో కొన్ని గ్రామానికి ఎత్తైన ప్రదేశాల్లో.. మరికొన్ని లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయి. ఎత్తు ప్రాంతాలకు నీరు అందడం లేదు. పల్లపు ప్రాంతాల్లో నీరు వచ్చినా అది కొద్ది నిమిషాలు మాత్రమే. మిగిలిన గ్రామాల్లో సైతం అరకొరగానే నీటి సరఫరా ఉంటోంది. ఆయా గ్రామాల్లో మంచినీటి ట్యాంకులు సైతం శుభ్రం చేసిన దాఖలాలు లేవు.


ఎనికపాడులోని సీపీడబ్ల్యూఎస్ పథకం

ఇంటింటికీ కుళాయి ఎప్పటికో...



పథకం పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఎనికపాడుకు రూ.1.60కోట్లు, తక్కెళ్లపాడుకు రూ.72.40లక్షలు, బొడ్డువారిపాలెంకు రూ.49.90లక్షలు, గంగవరంకు రూ.47.10లక్షలు, మాచవరంకు రూ.54.30 లక్షలు, చంద్రపాలెంకు రూ.76.20 లక్షలు, గుమ్మళంపాడుకు రూ.1.02కోట్లతో ప్రతిపాదనలు సైతం చేశారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కాలేదు. ఏళ్లు గడుస్తున్న, ప్రభుత్వాలు మారిన ముందుకు సాగడం లేదు. దీంతో సక్రమంగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కాస్తంత పట్టించుకుని మంచినీటిని అందించాలని కోరుతున్నారు.

ఓ మోస్తరు వర్షం.. నగరం జలమయం..

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆదివారం మధ్యాహ్నం కురిసిన ఓ మోస్తరు వర్షానికే ఒంగోలు కర్నూలు రోడ్డు జలమయమైంది. ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుంచి కేబీ రెస్టారెంట్ ఎదుట వరకు కాలువలు పొంగి వర్షపు నీరంతా రహదారిపై ప్రవహించింది. దీంతో రాకపోకలు సాగించే వాహనదారులతోపాటు పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. కర్నూలు రోడ్డులో మురుగుకాలువలు ఇరువైపులా పూడికతో నిండిపోయాయి. దుకాణాల ముందు ర్యాంపులు నిర్మించడంతో చెత్త తొలగించడానికి వీలు కాని పరిస్థితి. వర్షపు నీరు పోయే మార్గం లేక దుకాణాలకు వెళ్లేవారు వెనుదిరిగారు



కర్నూలు రోడ్డులో ప్రవహిస్తున్న నీరు

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

చీమకుర్తి, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ చీమకుర్తి గెలాక్సీ సేవలను మరింత విస్తృతం చేయాలని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కోరారు. గెలాక్సీక్లబ్ అధ్యక్షుడిగా కొండవేటి ఏడు కొండలు, పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో శిద్దా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో శిద్దా మాట్లాడుతూ.. లయన్స్ గెలాక్సీ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ క్లబ్ సేవలను మరిన్ని రంగాలకు విస్తరించాలన్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా కొండవేటి ఏడుకొండలు, బొడ్డు ఆంజనేయులు, కోశాధికారిగా ఆలపాటి నరసింహారావులతో మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్మన్ ప్రశాంతి, ఎల్ఈవో ఛైర్మన్ విజయ్ కుమార్ రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్లు సీహెచ్.హరిప్రసాద్, ఆర్.లక్ష్మీనారాయణ, డాక్టర్ బి.జవహర్, చలువాది బదరీనారాయణ, కోటా హనుమంతరావు, కొండవేటి సోదరులు కాంతారావు, వడ్డికాసులు, శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి శిద్దా రాఘవరావును సత్కరిస్తున్న గెలాక్సీక్లబ్ అధ్యక్షుడు ఏడుకొండలు తదితరులు


నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న సంఘం నాయకులు

విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా గోవిందాచారి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో నగర నూతన కార్యవర్గ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మానేపల్లి గోవిందాచారి, ప్రధాన కార్యదర్శిగా కె.దక్షిణామూర్తి, కోశాధికారిగా కొత్తపల్లి సాయి, గౌరవ అధ్యక్షుడిగా పోతులూరి శివబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.నాగబ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా చాలా కోటేశ్వరరావుతోపాటు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.



కొత్తగా ఎన్నికైన సభ్యులు వీరే...

వ్యవసాయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా యూనిట్ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక జేడీఏ కార్యాలయంలో ఆదివారం జరిగింది. అధ్యక్షునిగా ఎం.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా వి.శివచంద్రకుమార్, కోశాధికారిగా ఆర్.జయరావును ఎన్నుకున్నారు. కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవిప్రకాష్‌రావు, ఎంసీ కాశన్నలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

ఫ్యాన్సీగూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ ..

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని ఫ్యాన్సీగూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక సంఘం కార్యాలయంలో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడిగా కూరపాటి సత్యన్నారాయణ, గౌరవాధ్యక్షునిగా దేవత శ్రీరాములు, కార్యదర్శిగా తాతా వెంకటచెంచుగుప్తా, ఉపాధ్యక్షుడిగా తాతా శ్రీనివాసులు, కోశాధికారిగా పేర్ల రామ్మోహన్‌రావులను ఎన్నుకున్నారు.

ఏం కొనలేం.. ఏం తినలేం..

◆ ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు ◆ అవస్థలు పడుతున్న ప్రజలు

మద్దిపాడు, న్యూస్‌టుడే

గత కొద్దిరోజులుగా కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వినియోగదారులు కూరగాయల కొనుగోలు చేసేందుకు విపణికి వెళ్తే రూ.500 ఖర్చు చేసినా సగం సంచి కూడా నిండని పరిస్థితి. పరిస్థితి ఇలాగే అయితే ఎం కొనలేం.. ఎం తినలేమని సామాన్యులు వాపోతున్నారు. ఈ సంవత్సరం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు కూరగాయల తోటలపై తీవ్ర ప్రభావం చూపింది. విస్తీర్ణంతోపాటు దిగుబడి తగ్గింది. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన వస్తోందని.. వెరసి రవాణా ఛార్జీలు, ఇతర ఖర్చులు పెరిగి ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, గర్భిణీలకు అందించే పోషకాహారం మీద ప్రభావం చూపుతోంది. పెరిగిన ధరల వల్ల నిర్వాహకులకు గిట్టుబాటు కాక ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం భోజనం అందించలేకపోతున్నారు. కూరగాయలు కొనుగోలు చేయలేక.. అరకొరగానే కూరలతో సర్ది పెడుతున్నారు.

సెంచరీ కొట్టిన టమటా..

మద్దిపాడు మండల పరిధిలో గుండ్లపల్లి, గ్రోత్ సెంటర్, సీతారామపురం కోస్టాల్ తదితర కూరగాయల సంతలు శని, ఆదివారాల్లో బెండకాయలు, కాకరకాయలు, బీరకాయ, పచ్చిమిరప ధరలు ఒక కిలో రూ 60-70లు ఉండగా.. చిక్కుడు, క్యారెట్, క్యాలీ ఫ్లవర్‌లు ఒక కిలో రూ 80-100 ధర పలుకుతోంది. టమోటా అయితే సెంచరీ దాటింది. ఆనప కాయ కిలో రూ.120 ధర పలుకోతుంది. ఉల్లిపాయల రూ.100 వైపు శరవేగంగా దూసుకు వస్తోంది. మరోవైపు రైతులు పండించిన పంటను ఒంగోలులోని మార్కెట్‌కు తరలించి.. దుకాణదారులకు కాకుండా దళారులకు విక్రయిస్తున్నారని.. దాంతో మధ్యవర్తులు ధరలను కృత్రిమంగా పెంచుతున్నారనే కొందరు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


మార్కెట్‌లో వివిధ రకాల కూరగాయలు

నేటి నుంచి తపాలా వారోత్సవాలు

ఒంగోలు కర్నూలు రోడ్డు: ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు తపాలా శాఖ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ మహ్మద్ జాఫర్ ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా తపాలా సేవలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. విదేశాలకు ఉత్పత్తులు పంపేందుకు డాక్ ఘర్ నిర్యాత్ కేంద్ర పేరిట ప్రత్యేక సదుపాయం ఒంగోలు ప్రధాన కార్యాలయంలో అందుబాటులోకి తెచ్చామన్నారు.

దారి దోపిడీ కేసులో నలుగురి అరెస్టు

వేటపాలెం, న్యూస్‌టుడే: దారి దోపిడీ కేసులో నలుగురు పాత నేరస్థులను పోలీసులు అరెస్టు చేయగా మరొకరు పరారీలో ఉన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ జగదీష్ నాయక్ పోలీసు స్టేషనులో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. గతనెల 30న నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడుకి చెందిన పెదపూడి షాలెం రాజు తన తల్లిని చీరాల రైల్వేస్టేషను నుంచి తీసుకొచ్చేందుకు ద్విచక్రవాహనంపై తెల్లవారుజామున బయలుదేరి, పందిళ్లపల్లి ఎర్రగేటు వద్ద మూత్రవిసర్జనకు ఆగారు. ఈసమయంలో అయిదుగురు వ్యక్తులు రాజును ఇనుపరాడ్‌తో బెదిరించి అతని వాహనంతో పాటు చరవాణిని తస్కరించుకెళ్లారు. దీనిపై బాధితుడు వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా ఒంగోలుకు చెందిన దేవరకొండ మదన్ సాయితో పాటు మరో ముగ్గురు నిందితులను శనివారం రాత్రి అరెస్టు చేసి అయిదు ద్విచక్రవాహనాలు, 22 సెల్‌ఫోన్లు, నగదు రూ.2,200 కలిసి రూ.4.13లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై పలు స్టేషన్లలో కేసులు ఉండడంతో పాటు జైలుకు వెళ్లారని డీఎస్పీ చెప్పారు. వీరిని న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆదివారం గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పెంపకందారులను చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడు నెలలుగా పశువుల వైద్యశాలలకు మందులు రావడం లేదన్నారు. తద్వారా ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు చేయాల్సి రావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని వివరించారు. సమావేశంలో సంఘం నాయకులు తోట తిరుపతి, షేక్ మహబూబ్, షేక్ మాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి

ఉచిత వైద్య శిబిరం

మద్దిపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లింగంగుంట గ్రామ సచివాలయం వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో చైతన్య కార్డియాక్ సెంటర్, స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో గ్రామ ఎంపీటీసీ సభ్యుడు మన్నం కృష్ణ కిషోర్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు రోగులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మన్నం రాజశేఖర్, పాలెం రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు

సుప్రీంకోర్టు తీర్పుపై మాల ఉద్యోగుల నిరసన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నాయకులు స్థానిక కలెక్టరేట్ సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి మోకాళ్లపై కూర్చొని కొవ్వొత్తులతో వినూత్న నిరసన ప్రదర్శన చేపట్టారు. మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు మాట్లాడుతూ.. రిజర్వేషన్ వర్గీకరణ, క్రీమీ లేయర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో మాలలు వేసిన రివ్యూ పిటిషన్ తిరస్కరించడంపై ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: నిడమానూరులో బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మల్లేశ్వరి హెచ్ఐవీ వ్యాధిపై అపోహలు, అనుమానాలు పలు అంశాలను వివరించారు. అవగాహనతోనే ఈ వ్యాధిని నిర్మూలించగలరని చెప్పారు. ప్రభుత్వం ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అందజేస్తున్న వైద్య సేవలను తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి దివ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ నెల 8న ఒంగోలులో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు స్థానిక ప్రకాశం భవన్‌లోని సమావేశ మందిరంలో 'స్వర్ణాంధ్ర-2047'పై నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొంటారు.

అలరించిన సంగీత విభావరి

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఖాదర్ మెలోడీస్ ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఒంగోలు వారు స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ వద్ద ఆదివారం సాయంత్రం సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో గాయని గాయకులు పాడిన పాటలు అందరిని అలరించాయి. నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గాయకులు పురాణం సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, గాయనిలు శైలు చిత్ర, శైలజ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067 ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

రోడ్లపై పశువులు.. వాహనదారులకు ఇక్కట్లు..

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే

ఇటీవల నగరంలోని బాపూజీ కాంప్లెక్స్ వద్ద ముందు వాహనాన్ని ద్విచక్రవాహనం డివైడర్ వైపు దూసుకొచ్చింది. అక్కడ రోడ్డుపై ఆవులు పడుకొని ఉన్నాయి. అకస్మాతుగా బ్రేక్ వేయడంతో ద్విచక్ర వాహనదారుడు కిందపడిపోయారు. ఆ సమయంలో వాహనం వదిలేయడంతో చోదకుడు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇలాంటి సంఘటనలు నగరంలో నిత్యకృత్యంగా మారాయి. ఒంగోలు నగరంలో రోడ్లపై ఆవులు, కుక్కలు, నగర పరిసర ప్రాంతాల్లో అయితే పందులు కూడా నిత్యం రోడ్లపైనే తిరుగుతూ వాహనదారులకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయి. నగరంలోని సుమారు 100 ఆవుల వరకు ఉన్నాయి. వాటిల్లో 30 వరకు దేవస్థానాలకు సంబంధించినవి.. మిగతా వాటిని యజమానులు పాలు పిండుకుని మేతకు రోడ్లపైకి వదిలేస్తున్నారు. అవి అడ్డదిడ్డంగా రోడ్లపై సంచరిస్తుండడంతో రాకపోకల సమయంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇంత జరుగుతున్నా నగరపాలక సంస్థ ఎటువంటి చర్యలు తీసుకోవటం లేదని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై శానిటరీ సూపర్ వైజర్ పిచ్చయ్యను న్యూస్‌టుడే వివరణ కోరగా.. ఇరవై రోజుల కిందటే యజమానులను పిలిపించి.. పశువులను రోడ్లపై వదిలేయడం సరికాదని.. ఇది ఇలానే కొనసాగితే దగ్గరలో ఉన్న గోశాలకు తరలిస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. తీరు మార్చుకోని వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


గోపాల్‌నగర్ వైపు వెళ్లే మార్గంలో రోడ్డు మధ్యలో ఆవులు